ఆర్మీ అధికారులమంటూ మోసం !

● విరాళాలు ఇవ్వాలని సైబర్ నేరగాళ్ల సందేశాలు

● ప్రజలు నమ్మి మోసపోవద్దు : ఎస్పీ



రాయచోటిటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): తాము ఆర్మీ అధికారులమని, విరాళాలు ఇవ్వాలంటూ సైబర్ నేరగాళ్ల తప్పుడు సందేశాలు పంపుతున్నారని, ఇలాంటి వాటి పట్ల జిల్లా ప్రజలు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వం, ఆర్మీ అధికారులు, సైనికులు ఎవరూ విరాళాలు అడగరని ఆయన తెలిపారు. భారతదేశ సరిహద్దుల్లో ఇండియన్ ఆర్మీ శత్రుదేశ మిసైళ్లను కూలుస్తుంటే సైబర్ నేరగాళ్లు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఉద్రిక్త పరిస్థితులను అదునుగా తీసుకొని కొత్త మోసానికి తెరలేపినట్లు చెప్పారు. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల్లో సైనికులకు ఆర్థిక సహాయం చేయాలని సందేశాలు పంపుతూ దొరికినంత దోచుకుంటారని, ఎవరూ ఎటువంటి లింక్‌లను టచ్ చేయవద్దన్నారు. అలాగే ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయవద్దని, గుర్తు తెలియని నెంబర్ల నుంచి ఫోన్ కాల్ వచ్చినా, సందేశం వచ్చినా ఎటువంటి పరిస్థితుల్లో స్పందించవద్దని సూచించారు. ఇలాంటి సందేశాలు నమ్మి యూపీఐ మాధ్యమాల ద్వారా డబ్బులు పంపించవద్దని ఎస్పీ ఆ ప్రకటనలో జిల్లా ప్రజలను అప్రమత్తం చేశారు.

50 శాతం రాయితీతో పశువుల దాణా

● జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై

చిన్నమండెం, మే 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణపై 50 శాతం రాయితీతో రైతులకు మొదటిసారిగా 20 శాతం ప్రొటీన్‌తో కలిగిన దాణా పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పశువైద్య కార్యాలయం వద్ద రైతులకు ఈ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో పాడి రైతులను ఆదుకోవాలన్న దృఢ సంకల్పంతో 50 శాతం రాయితీతో దాణా పంపిణీ చేస్తోందని, ఒక రేషన్‌కార్డుకు 450 కిలోల పశువుల దాణాను రాయితీపై అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం కిలో రూ.22.21లకు కొనుగోలు చేసి రైతులకు రూ.11.10 చొప్పున రైతుసేవా కేంద్రాల ద్వారా అందిస్తోందని ఆయన తెలిపారు. అలాగే జిల్లాకు ఇప్పటి వరకు 250 టన్నుల దాణా సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యుడు గణేశ్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సబ్సిడీపై పశువుల దాణాను రైతులకు అందజేస్తున్న దృశ్యం

హార్సిలీహిల్స్‌లో రెస్టారెంట్ సీజ్

● కలెక్టర్ ఆదేశాలతో మూసివేసిన రెవెన్యూ సిబ్బంది

బి.కొత్తకోట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో ఉన్న వీఎస్‌ఆర్ విండ్ వేవ్ రెస్టారెంట్‌ను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు శుక్రవారం తహసీల్దార్ అజారుద్దీన్ సీజ్ చేశారు. బీఎస్ఎన్ఎల్ సంస్థకు కేటాయించిన స్థలం లీజుకు తీసుకొని సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి ఈ ప్రైవేట్ రెస్టారెంటును నిర్మించి లాడ్జింగ్, బోర్డింగ్ నిర్వహిస్తున్నారు. ఈ రెస్టారెంట్ నుంచి వెలువడే మురుగునీరు సమీపంలోని పర్యాటకులు ఎక్కువగా పర్యటించే గాలి బండపైకి వదులుతున్నారని, వ్యర్థపదార్థాలను గాలిబండ ముఖద్వారంలో ఉన్న తొట్టిలో వేస్తున్నారని, దీనివల్ల దుర్గంధంతో పారిశుధ్య లోపం ఏర్పడుతోందని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో తగు చర్యలు తీసుకోవాలంటూ గతంలో అధికారులు హెచ్చరించారు. ఇదే అంశాలపై సబ్‌కలెక్టర్, హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ ఛైర్మన్ మేఘస్వరూప్ షోకాజ్‌నోటీసు ఇచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ శ్రీధర్, సబ్‌కలెక్టర్ హిల్స్‌కు వచ్చారు. మరోసారి ఈ రెస్టారెంట్ ప్రస్తావన రావడంతో ఆగ్రహించిన కలెక్టర్ తక్షణం రెస్టారెంట్‌ను సీజ్ చేయాలంటూ ఆదేశించారు. దీంతో తహసీల్దార్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని విద్యుత్ సరఫరాను కట్ చేశారు. పంచనామా నిర్వహించి లాడ్జ్, హోటల్‌ను ఖాళీ చేయించి, తలుపులకు తాళాలు వేశారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు రెస్టారెంట్ మూతపడే వుంటుందని పేర్కొన్నారు. కాగా సీజ్ చేయనున్నట్లు తెలియడంతో రెస్టారెంట్ యజమాని సుధాకర్‌రెడ్డి సబ్‌కలెక్టర్‌ను కలిసి పరిస్థితిని విన్నవించారు. ఏదైమైనా కలెక్టర్ ఆదేశాల మేరకు సీజ్ చేయక తప్పదని సబ్‌కలెక్టర్ పేర్కొన్నట్లు తెలిసింది.



హోటల్‌ను సీజ్ చేస్తున్న తహసీల్దార్ అజారుద్దీన్

పాతాళానికి గంగ

● 1200 అడుగుల్లో బోర్లు వేసినా జాడ లేని నీటి చుక్క

● తోటలను కాపాడేందుకు ట్యాంకర్లతో నీరు

● ఆందోళన చెందుతున్న రైతులు



ఎండిపోతున్న మామిడి చెట్లు

గాలివీడు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో 25 వేల ఎకరాల సాగుభూమి కలదు. అన్ని పంచాయతీల్లోనూ 100 కు పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటితో పాటు వెలిగల్లు, కుషావతి ప్రాజెక్టులు కలవు. వీటి కింద 6 వేల ఎకరాల సాగు భూమి, దీంతో పాటు ఎలాంటి నీటి ఆధారం లేని 19 వేల ఎకరాల మెట్ట, మాగాణి భూములు ఉన్నాయి. చెరువుల కింద, కుంటల కింద ముఖ్యంగా వరి ఎక్కువగా సాగు చేస్తారు. నీటి సౌకర్యం లేని మెట్ట భూముల్లో వేరుశనగ, కంది, ఉలవ, ప్రొద్దుతిరుగుడు, కూరగాయల పంటలతో పాటు మామిడి, అరటి, జామ, నిమ్మ, సపోట వంటి తోటలను సాగు చేస్తున్నారు. కానీ భూగర్భజలాలు అడుగంటడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచైనా నీటిని అందించాలని కోరుతున్నారు.

నీటి చుక్క జాడే లేదు

మండలంలో గత రెండేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువ నమోదైంది. కుషావతి ప్రాజెక్టు ద్వారా అరవీడు పంచాయతీలోని కొంత మేర భూములు సాగులో కలవు. 4.54 టీఎంసీల సామర్థ్యంలో 24 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి ఏర్పాటు చేసిన వెలిగల్లు జలాశయం గాలివీడు మండలంలో కేవలం 2 వేల ఎకరాలకు కూడా సక్రమంగా సాగునీరు అందించడం లేదు. ముఖ్యంగా గరుగుపల్లి, తూముకుంట, పందికుంట, కొర్లకుంట, తలముడిపి పంచాయతీల్లో సాగు భూమిలోకి నీటి పారుదల సౌకర్యం కలదు. పేరంపల్లి, గుండ్లచెరువు, పూలుకుంట పంచాయతీల్లో కొంత మేర భూములు సాగులోకి వస్తాయి. గోరాన్‌చెరువు, ఎగువగొట్టివీడు, చీమలచెరువుపల్లి, నూలివీడు, గోపనపల్లి పంచాయతీల్లో భూములకు నీటి సరఫరా లేదు. ఈ గ్రామ పంచాయతీల్లో 10 వేల ఎకరాలకు పైగా మెట్ట, మాగాణి భూములు కలవు. సాగునీరు సరఫరా లేకపోవడంతో రైతులు పంటల సాగు కోసం, మామిడి తోటలను కాపాడుకోవడం కోసం 1200 అడుగుల వరకు బోర్లు వేసినా నీళ్లు పడని పరిస్థితి నెలకొంది. ఈ బోరుకు మాత్రమే రూ.2 లక్షలు ఖర్చు అవుతున్నదని రైతులు తెలిపారు. కొద్దిగా నీళ్లు పడితే మోటారుకు, పైపులకు, విద్యుత్ కనెక్షన్‌కు రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతున్నదని, ఈ మోటారు బిగించినా తరువాత కొద్ది రోజులకు బోరు బావులు అడుగంటిపోతున్నాయని, తద్వారా తీవ్రంగా నష్టపోతున్నామన్నారు.



ట్యాంకర్లతో మామిడి చెట్లకు నీటిని అందిస్తున్న దృశ్యం

గత పదేళ్లుగా మండల వ్యాప్తంగా వివిధ రకాల పండ్ల తోటల పెంపకం అధికమైంది. ప్రతి గ్రామంలో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. వర్షాలు పడకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో తోటలను కాపాడుకోవడం కోసం లక్షలు వెచ్చించి ఒక్కొక్కరు 5 నుంచి 10 బోర్లకు పైగా వేసినట్లు రైతులు పేర్కొన్నారు. కొంత మంది రైతులు తోటలను కాపాడుకోవడం కోసం ట్యాంకర్ల ద్వారా చెట్లకు నీటిని పడుతుండగా మరికొంత మంది రైతులు ట్యాంకర్లకు డబ్బులు ఇవ్వలేక తోటలను వదిలేశారు. నీటి సౌకర్యం లేని తోటలు ఎండిపోతున్నాయి. ఒక్కో నీటి ట్యాంకరుకు రూ.600 ఖర్చు అవుతున్నదని, నెలకు ప్రస్తుత ఎండలను దృష్టిలో పెట్టుకొని నెలకు మూడు సార్లు తోటలకు నీటిని వదలాలన్నారు. మామిడి తోటలు ఈ ఏడాది పూత ఘనంగా పూసినప్పటికీ (పింజ) కాయ నిలబడలేదు. ఈ ఏడాది మామిడి కాయల దిగుబడి చాలా తగ్గిపోయింది. పెట్టుబడులు ఎక్కువ, దిగుబడి తగ్గిపోవడంతో మమిడి తోటల రైతులు తీవ్రంగా, ఆర్థికంగా నష్టపోనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నీటి పారుదల రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల నేడు రైతులకు సాగునీరు అందలేదని, తద్వారా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మరికొందరు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఎండిపోతున్న మామిడి చెట్ల రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

'ఎత్తిపోతల' ద్వారా సాగునీరు అందించాలి

పేరుకే గాలివీడు మండలంలో వెలిగల్లు ప్రాజెక్టు ఉన్నదని, నీళ్లు అన్నీ ఇతర మండలాలకు పోతున్నాయని మండల ప్రజలు, రైతులు అంటున్నారు. తాగు, సాగునీరు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పేర్కొంటున్నారు. నీటి సౌకర్యం లేకపోవడంతో మండలంలో అధిక శాతం భూమి బీడు భూములుగా మారి పోయాయని, ఉన్న తోటలకు నీళ్లు లేక ఎండిపోతున్నాయని చెబుతున్నారు. కావున వెలిగల్లు ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా కనీసం చెరువులకు, కుంటలకు, భూములకు సాగునీరు అందించాలని, అలా చేస్తే భూగర్భ జలాలు పెరిగి బోరు బావుల్లో నీటి మట్టం పెరుగుతాయని, తద్వారా పంటల సాగుతో పాటు మామిడి చెట్లను కాపాడుకోవచ్చని చెబుతున్నారు.

1200 అడుగులు వేసినా నీళ్లు పడని బోరు



దేశానికి రైతే వెన్నముక. రైతు లేనిదే రాజ్యం లేదు. రైతుతోనే దేశం సుభిక్షం. కానీ అందుకు తగ్గ విధంగా ప్రకృతి రైతుకు సహకరించడం లేదు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే భూమితో పాటు నీరు కూడా అవసరమే. అవి లేకుంటే వ్యవసాయమే లేదు. కానీ ఆ నీటిని అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. చేసేది లేక.. వ్యవసాయంపై మక్కువను చంపుకోలేక పంటలను కాపాడుకునేందుకు రైతులే అప్పులు చేసి బోర్లు వేసినా నీటి జాడ కనిపించడం లేదు. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి విలవిల్లాడుతున్నారు. పగలనక, రాత్రనక నిద్రాహారాలు మాని కన్నబిడ్డల్లా చూసుకున్న పంటలు కళ్ల ముందే ఎండిపోతుండడంతో లబోదిబోమంటున్నారు.

బోర్లు వేయడం వల్ల తీవ్రంగా నష్టపోయాను..



కాల్వపల్లి ఈశ్వర్‌రెడ్డి, నల్లగుండ్లపల్లి

నేను ఇప్పటికే 5 బోర్లు వేశాను. మాకు 400 మామిడి చెట్లు కలవు. వీటిని కాపాడుకోవడం కోసం లక్షలు వెచ్చించి బోరు బావులు వేశాము. కొన్ని బోర్లలో కొన్ని గంటలే నీళ్లు వస్తున్నాయి. ఒక్కో బోరు వెయ్యి అడుగుల పైన వేసినా నీళ్లు పడలేదు. నాకున్న మామిడిచెట్లకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలంటే అధిక ఖర్చుతో కూడుకున్నది. బోరుబావులు వేయడం వల్ల తీవ్రంగా నష్టపోయాను. ప్రభుత్వం స్పందించి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసుకునేందుకు రాయితీలు కల్పించాలి.

మహిళ ప్రాణాలు కాపాడిన ఆర్టీసీ సిబ్బంది

● సకాలంలో ఆసుపత్రికి తరలింపు



పీలేరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుసుమ

పీలేరు, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడంలో తమకు తామే సాటి అని ఆర్టీసీ సిబ్బంది నిరూపించుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళను సకాలంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రజల పట్ల తమకున్న బాధ్యతను నిర్వర్తించారు. నిమ్మనపల్లె పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రాజేశ్‌కుమార్ వాల్మీకిపురంలో కాపురం ఉంటున్నాడు. అతని భార్య కుసుమకు శుక్రవారం ఉదయం ఛాతీ నొప్పి రావడంతో చికిత్స కోసం ఆర్టీసీ బస్సులో తిరుపతికి బయలుదేరారు. మార్గమధ్యంలోని రొంపిచెర్ల మండల పెద్దగొట్టిగల్లు వద్దకు బస్సు చేరుకోగానే ఆమె పరిస్థితి ఇబ్బందికరంగా మారడంతో ఏం చేయాలో తోచక అక్కడే బస్సు దిగేశారు. ఆ సమయంలో పీలేరుకు వస్తున్న పీలేరు-తిరుపతి మధ్య నడిచే ఆర్టీసీ బస్సు డ్రైవర్ మధుసూదన్, కండక్టర్ పృథ్వీకుమార్, రోడ్డు పక్కన ఉన్న కుసుమను గమనించి ఆమె పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా బస్సులోని ప్రయాణికులకు నచ్చజెప్పి ఆమెను ఎక్కించుకుని మధ్యలో ఎక్కడా ఆపకుండా నేరుగా పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదే బస్సులో ఉన్న పీలేరు వ్యవసాయ శాఖాధికారి కరుణాకర్‌రెడ్డి, స్థానిక పాత్రికేయుల ద్వారా పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన తన సిబ్బందితో అప్రమత్తమై బస్సు రాగానే ఆమెకు చికిత్స ప్రారంభించారు. సకాలంలో స్పందించి మహిళ ప్రాణాలు కాపాడిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌లను స్థానికులు అభినందించారు. కాగా కాసేపటికి ఆమె పరిస్థితి మెరుగవడంతో కుటుంబసభ్యులు అంబులెన్సులో తిరుపతికి తరలించారు.

రైల్వేస్టేషన్, బస్సుల్లో విస్తృత తనిఖీ

7



గ్రంథాలయాల సెస్సూ..తుస్సూ..!

● పట్టించుకోని స్థానిక సంస్థలు, ప్రభుత్వం

● 2015 నుంచి పేరుకుపోయిన బకాయిలు

● కుంటుపడుతున్న నిర్వహణ



పీలేరులోని శాఖా గ్రంథాలయం

పీలేరు, మే 9(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు ఆధునిక, చైతన్యవంతమైన సమాజానికి చిహ్నం. పాఠశాల, వైద్యశాల, పోలీసుస్టేషన్ ఎంత అవసరమో గ్రంథాలయం కూడా అంతే అవసరం. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో అయ్యంకి వెంకటరమణయ్య, కొమర్రాజు వెంకటలక్ష్మి, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు వంటి మహనీయులు గ్రంథాలయ ఉద్యమం ద్వారానే ప్రజలను చైతన్యవంతుల్ని చేసి స్వతంత్ర ఉద్యమానికి తోడ్పడ్డారు. అటువంటి గ్రంథాలయాలు గడిచిన దశాబ్దకాలంగా ప్రభుత్వాల నిరాదరణకు గురవుతున్నాయి. వాటి నిర్వహణకు నిధులు ఇవ్వకుండా మొండికేస్తున్నాయి. తద్వారా గ్రంథాలయాల నిర్వహణ నానాటికీ కష్టతరమవుతుండగా అవి ప్రజలకు దూరమవుతున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రూ.13 కోట్లు

జిల్లాల విభజన జరిగినప్పటికీ గ్రంథాలయాల నిర్వహణ మాత్రం ఇప్పటికీ ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జరుగుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 73 గ్రంథాలయాలు ఉండగా వాటిల్లో కేవలం 37 మంది రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. గ్రంథాలయాల్లో దశాబ్దాలుగా ఉద్యోగాల భర్తీ చేపట్టకపోవడంతో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఒక్కో గ్రంథాలయాధికారి రెండు, మూడు ఊళ్లలో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సర రికార్డుల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా రూ.13 కోట్ల మేర పంచాయతీల నుంచి సెస్సు చెల్లింపులు బకాయిలు నిలిచిపోయాయని గ్రంథాలయ అధికారులు వాపోతున్నారు. కేవలం పీలేరు మండలంలోనే 2015 నుంచి గ్రంథాలయాలకు స్థానిక సంస్థల నుంచి రూ.43,64,754లు రావాల్సి ఉండగా, ఒక్క పీలేరు గ్రామ పంచాయతీ నుంచి రూ.36,87,754లు రావాల్సి ఉంది. పీలేరు గ్రంథాలయాధికారి పలుమార్లు విజ్ఞప్తి చేయగా ఇటీవల పీలేరు ఈవో రూ.2 లక్షలు చెల్లించారు.

బకాయిలు చెల్లిస్తే నూతన జవసత్వాలు

గ్రంథాలయాలకు రావాల్సిన బకాయిలు చెల్లిస్తే వాటికి నూతన జవసత్వాలు సమకూరుతాయి. గ్రంథాలయాలకు వస్తున్న వారి సంఖ్య గణనీయంగా ఉంటున్నప్పటికీ మారుతున్న కాలానుగుణంగా పుస్తకాలు కొనుగోలు చేయలేక, పాఠకులకు సౌకర్యాలు కల్పించలేకపోతున్నాం. వసూలు చేసిన సొమ్మును చెల్లించడానికి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వమైనా దీని గురించి పట్టించుకుని గ్రంథాలయాలను పరిరక్షించాలి.

- అమరనాథ్, గ్రంథాలయాధికారి, పీలేరు

ఒబెరాయ్ బృందం మరో సా..రీ..



అర్జున్ ఒబెరాయ్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ శ్రీధర్

● సస్పెన్స్‌లో స్టార్‌హోటల్ నిర్మాణం

● స్థలాన్ని పరిశీలించిన సంస్థ ఈసీ అర్జున్ ఒబెరాయ్

● కలెక్టర్, సబ్‌కలెక్టర్‌తో రహస్య చర్చలు

బి.కొత్తకోట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో హోటల్ రంగంలో ప్రసిద్ధి చెందిన ఒబెరాయ్ సంస్థ నిర్మిస్తుందని భావిస్తున్న ఫైవ్‌స్టార్ హోటల్‌పై సందిగ్ధత కొనసాగుతోంది. హోటల్ నిర్మాణం జరుగుతుందా.. లేదా అనే సస్పెన్స్‌కు శుక్రవారం తెరపడుతుందని అందరూ భావించినా ఇంకా స్పష్టత రాలేదని అధికారుల తీరు చెప్పకనే చెప్పింది. గతేడాది ఈ సంస్థ ప్రతినిధులు వచ్చి తమకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి వెళ్లారు. అప్పట్లో కలెక్టర్ శ్రీధర్ పర్యవేక్షణలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా హిల్స్‌పై హోటల్ నిర్మాణానికి వున్న అనుకూలతను, కర్నాటక రాజధాని బెంగళూరు సహా ప్రధాన నగరాలతో హిల్స్‌కు ఉన్న కనెక్టివిటీని వివరించారు. వారిని ఒప్పించే ప్రయత్నం కూడా చేశారు. మిగతా ఫార్మాలిటీస్‌ను పూర్తి చేసి సెప్టెంబరులో నిర్మాణపనులు ప్రారంభిస్తారని ప్రకటించారు. అది కార్యరూపం దాల్చలేదు. దీంతో అనుమానాలు మొదలయ్యాయి. ఎనిమిది నెలల తర్వాత మరోసారి ఈ బృందం రావడంతో వ్యవహారం కొలిక్కి రావచ్చని భావించారు. అయితే ఈసారి ఏకంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అర్జున్ ఒబెరాయ్ కూడా బృందంలో ఉన్నారు. అయినా మళ్లీ అదే తంతు జరిగింది. వచ్చారు.. చూశారు.. వెళ్లారు అన్నట్లుగా సాగింది. కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ముంబై నుంచి వచ్చిన ఒబెరాయ్ బృందానికి యథాప్రకారం పరిస్థితిని వివరించారు.

హోటల్ నిర్మాణం ఉందా.. లేదా ?

హార్సిలీహిల్స్‌లో రూ.200 కోట్లతో ఒబెరాయ్ సంస్థ స్టార్ హోటల్‌ను నిర్మాణానికి సిద్ధం అయిందా.. లేదా అనే సస్పెన్స్ కొనసాగుతోంది. కొండపై సర్వే నెంబరు 591, 592 లలో కేటాయించిన 19.80 ఎకరాల స్థలాన్ని శుక్రవారం మరోసారి పరిశీలించిన ఒబెరాయ్ సంస్థ ఛైర్మన్ అర్జున్ ఒబెరాయ్ గాలి బండతో పాటు, చుట్టుపక్కల హద్దులను కాలిన డకన వెళ్లి పరిశీలించారు. గవర్నర్ బంగ్లాలో సమావేశమై ప్రతినిధులు కలెక్టర్ శ్రీధర్ చామకూరి, సబ్‌కలెక్టర్‌లతో పలు విషయాలు చర్చించారు. ఎన్ని అంతస్తులు నిర్మించవచ్చు, నీటి లభ్యత, పరిపాలనా అనుమతులు, ప్రభుత్వం నుంచి వెసులుబాట్లు తదితర అంశాల పై పరస్పరం మాట్లాడినట్లు తెలిసింది. పర్యటన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్ర భుత్వ ఆదేశాల మేరకు హార్సి లీహిల్స్‌ను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నా రు. సీఎం చంద్రబాబు పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి నట్లు పేర్కొన్నారు. ఒబెరాయ్ బృందంతో చర్చల అనంతరం బోర్డు సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని వారు తెలిపినట్లు వివరించారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం మేనేజర్ నాగభూషణం, తహసీల్దార్ అజారుద్దీన్, టూరిజం మేనేజర్ సాల్విన్‌రెడ్డి, పలువురు సర్వేయర్లు, టూరిజం సిబ్బంది పాల్గొన్నారు.

మీడియాకు నో పర్మిషన్

ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి సంబంధించి ఆ సంస్థ ప్రతినిధులు హార్సిలీహిల్స్‌కు వస్తుండటం, ఈ కార్యక్రమం కలెక్టర్, సబ్ కలెక్టర్ల పర్యవేక్షణలో జరగనుండటంతో స్థానిక ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హిల్స్‌కు చేరుకు న్నారు. అయితే ఒబెరాయ్ బృంద పర్యటనకు సంబంధించి కవరేజ్ అవసరం లేదని, ఎవ్వరూ ఫోటోలు తీయకూడదని అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో విలేఖరులు విస్తుపోయారు.

పెట్టుబడి కొండంత.. ఫలితం గోరంత

● ధరలు లేక పొలంలోనే వదిలేసిన మిరప, టమోటా పంటలు ● రూ.లక్షల్లో నష్టం ● ప్రభుత్వం ఆదుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి): అసలే కరువు ప్రాంతం. రైతులు అప్పోసప్పో చేసి కొండంత ఖర్చు పెట్టినా చివరకు మిగిలేది గోరంతే. ప్రతియేటా ఖరీఫ్, రబీలో సాగు చేసిన వేరుశనగ పంట సకాలంలో వర్షాలు కురవక అప్పులే మిగులుతున్నాయి. మండల వ్యాప్తంగా టమోటా, కాకర, మిరప పంటలకు ధర లేక రైతులు పొలంలోనే వదిలేశారు. 25 కిలోల టమోటా కిట్టు కేవలం రూ.50కే అడుగుతున్నారని రైతులు వెంకటసుబ్బారెడ్డి, రాంబసిరెడ్డి, విశ్వనాథరెడ్డి తెలిపారు. టమోటా మంచి దిగుబడి వస్తుందని, ఎకరాకు రూ.లక్షా 50 వేలు ఖర్చు పెట్టి సాగు చేశామని, పంట అద్భుతంగా వచ్చిందని, అయితే మార్కెట్‌లో కిలో రెండు రూపాయలకు కూడా అడగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పచ్చిమిరప కాయలు మార్కెట్‌లో కిలో రూ.5కు అడుగుతున్నారని, కూలీలకు కూడా సరిపడా డబ్బు రావడం లేదన్నారు. దీంతో పొలంలోనే వదిలేశామని రైతు వెంకట్రామిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.



కస్తూరిరాజుగారిపల్లెలో పండ్లతో సహా వదిలేసిన టమోటా తోట

టమోటా, కాకర, పచ్చిమిరపకు రూ.5 లక్షలు ఖర్చు పెట్టా



ఉన్న ఏడు ఎకరాల్లో ఐదు ఎకరాలు కాకర, టమోటా, పచ్చిమిరప పంటలు సాగు చేసి రూ.5 లక్షలు ఖర్చు పెట్టాను. రెండు బోర్లలో నీరు సక్రమంగా రాక డ్రిప్ ద్వారా పంటలు సాగు చేశాను. టమోటాలు ఆపిల్ పండ్ల మాదిరి వచ్చినా ధర మాత్రం లేదు.ఈ మూడు పంటల్లో దాదాపు రూ.20 లక్షలు నష్టం వచ్చింది.

- రాంబసిరెడ్డి, రైతు, సిద్ధకవాండ్లపల్లె



ఎగువబత్తెనపల్లిలో పొలంలోనే వదిలేసిన పచ్చిమిరప పంట

మారెమ్మ ఆలయానికి గ్రానైట్ వితరణ



ఆలయానికి గ్రానైట్ బండలు అందజేసిన దాతలు

నందలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లెలో వెలసిన మారెమ్మ తల్లి ఆలయానికి రూ.1.10 లక్షల విలువచేసే గ్రానైట్ బండలను రాయల్ మెడికల్స్, మీ సేవా అధినేతలు అరిగె మణి, అరిగె హరిబాబు శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యులు తమను సంప్రదించగా 13 చదరాల గ్రానైట్ బండలను కొనుగోలు చేసి ఆలయం వద్దకు తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గారెడ్డి, మేస్త్రి నారాయణ, ఆది వెంకటేశ్, ఆంజనేయులు, సుబ్బనరసయ్య, కుంభగిరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సెమీ ఫైనల్ మ్యాచ్‌లు

సుండుపల్లె, మే9(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె ఎంకేఆర్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 10 నుంచి సెమీ ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని శుక్రవారం ఆర్గనైజర్లు జయరాం,వెంకటేశ్ తెలిపారు. గత పది రోజుల నుంచి స్వర్గీయ మిన్నమరెడ్డి శివారెడ్డి జ్ఞాపకార్థంగా జరుగుతున్న టోర్నమెంట్ సెమీ ఫైనల్ దశకు చేరుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి స్వామివారి ఉత్సవాలు

రైల్వేకోడూరు రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లి పంచాయతీలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు శనివారం, ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పంద్ర నరసింహులు తెలిపారు. భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

21న హరిహరాదుల తిరునాళ్లు

వీరబల్లి, మే9(ఆంధ్రజ్యోతి): వీరబల్లి హరిహరాదుల దేవస్థానంలో ఈ నెల 12న జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్ల కరపత్రాలను విడుదల చేశారు. అందరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని వారు తెలియజేశారు.

ప్రారంభమైన అంకాలమ్మ తిరునాళ్లు

రైల్వేకోడూరు, మే 9(ఆంధ్రజ్యోతి): అంకాలమ్మ తిరునాళ్లు శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. మొదటిగా వినాయకుడికి పూజలు చేసి అనంతరం హోమాలు చేశారు. అంకాళమ్మదేవతను వేదపండితులు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు.

మా ఊరి భూమి మాకే కావాలి

● ఆందోళన చేపట్టిన సిద్దారెడ్డిపల్లె పంచాయతీ పేదలు



సాగు చేసుకుంటున్న భూమిని తమకే ఇవ్వాలని ఆందోళన చేస్తున్న పేదలు



తమ అనుభవంలో ఉన్న భూమిలో రైతులు సాగు చేసిన మామిడి

చిట్వేలి, మే 9(ఆంధ్రజ్యోతి): మా ఊరిలో ఉన్న భూమిని మాకే ఇవ్వాలని చిట్వేలి మండలం సిద్దారెడ్డిపల్లె పంచాయతీకి చెందిన పేదలు టీ.చలపతి, ఎల్.రెడ్డమ్మ, డి.నరసింహులు తదితరులు విన్నవించారు. శుక్రవారం ఆ భూమి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు రాజకీయ నాయకులు, భూస్వాములు కలిసి తమ స్వాధీనంలో ఉన్న భూమిని ఇతర ప్రాంతాలకు చెందిన వారికి కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. రిజర్వుడు ఫారెస్టుకు సంబంధం లేని భూమినే తాము అనుభవిస్తున్నామని తెలిపారు. అయితే అటవీశాఖ అధికారులు ఆ భూమిలో నాటిన మామిడి మొక్కలకు నీరు పోయనివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. తమ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నా పట్టాలు ఇవ్వడం లేదన్నారు. వివిధ కులాలకు చెందిన సుమారు 30 మంది పేద ప్రజలం ఎలాంటి జీవనం లేకుండా ఉన్నామని, కొంత భూమిని సాగు చేస్తుంటే అడ్డుపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్దారెడ్డిపల్లె పరిధిలో భూస్వాములు గుట్టలను సైతం ధ్వంసం చేసి సాగుచేసుకుంటున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం 54 సర్వేనెంబరులో 969 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆక్రమణలు పోను ప్రస్తుతం 20 ఎకరాలు మిగిలి ఉందన్నారు. ఈ భూమిని తాము సాగు చేసుకుంటున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తమకు పట్టాలు ఇప్పించి న్యాయం చేయాలని హైకోర్టును ఆశ్రయించామని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

సర్వేనెంబరు 54లో ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు

సిద్దారెడ్డిపల్లె రెవెన్యూ గ్రామం 54 సర్వే నెంబరులో మిగిలి ఉన్న భూమిలో ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని చిట్వేలి తహసీల్దార్ మోహనక్రిష్ణ వివరించారు. ఈ భూమి హై కోర్టులో ఉందని, వచ్చే జూలైలో కోర్టు తీర్పు వచ్చిన తర్వాత ఈ విషయం పరిశీలిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

'అనుమతి లేని హోటళ్లపై చర్యలు తీసుకోవాలి'

రాయచోటిటౌన్, మే9(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా నిర్వహిస్తున్న టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన రాయచోటి పట్టణంలోని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ రాయచోటి జిల్లా కేంద్రం అయినప్పటికీ నుంచి విచ్చలవిడిగా అనుమతి లేకుండా ఫుడ్ సేఫ్టీ నిబంధనలను పాటించకుండా టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెండ్ల నిర్వహణ జోరుగా కొనసాగిస్తున్నారన్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు పొందని నిత్యావసర సరుకులను, నూనెలను వాడుతూ ప్రజల అనారోగ్యాలకు కారణమవుతున్నారన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేసి ప్రజారోగ్యాన్ని కాపాడడాలని కోరారు.

మత సామరస్యానికి ప్రతీక జెండామాను మహోత్సవం

లక్కిరెడ్డిపల్లె, మే9(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక జెండామాను మహోత్సవం అని మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని దిన్నెపాడు పంచాయతీలోని దూదేకులపల్లెలో జెండాను మాను మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అన్ని మతాల వారు పాల్గొని ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె భక్తులు పాల్గొని ప్రార్థనలు చేస్తారన్నారు.

ఎస్ఎఫ్ఐ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

రైల్వేకోడూరు రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లిలో ఈ నెల 17 ప్రారంభించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులకు రాష్ట్ర నలుమూలల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు దీవన్, విజయ్, ఆదర్శ్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం: చమర్తి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

సిద్దవటం, మే 9 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని భాకరాపేట గ్రామంలో మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీము కింద రూ.5 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను జగన్‌మోహన్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. సిద్దవటం ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ పనులు త్వరలో చేపడతామన్నారు. ఖాదర్‌బంగ్లా, జ్యోతి పెన్నానదిపై వంతెన నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులునాయుడు,టీడీపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథ నాయుడు, గ్రామ సర్పంచ్ ప్రతినిధి, టీడీపీ యువనేత ప్రతాప్‌నాయుడు, ఉపసర్పంచ్ ప్రతినిధి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ్రాయుడికి కువైత్‌లో నివాళి

రాయచోటిటౌన్, మే9(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ కీర్తిశేషులు సుగవాసి పాలకొండ్రాయుడికి కువైత్ దేశంలో టీడీపీ ఎన్నారైల ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. నాలుగు దశాబ్దాల పాటు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం ఎంపీగా రాయచోటి నియోజకవర్గ ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేసిన పాలకొండ్రాయుడు లేని లోటు తీరనిదన్నారు. పెద్దాయన చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఫారంపాండ్ల పనులు ఈనెల చివరికి పూర్తి చేయాలి

రామాపురం, మే9(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో చేపట్టిన ఫారంపాండ్ల పూడిక పనులు మే చివరి నాటికి పూర్తి చేయాలని డ్వామా పీడీ వెంకటరత్నం సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని హసనాపురం పంచాయతీ చీకటివాండ్లపల్లెలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ కూలీలకు రూ.307 కూలి పడే విధంగా పనులు కల్పించాలన్నారు. కూలీలను పెంచి మే నెల చివరి నాటికి టార్గెట్ పూర్తి చేయాలన్నారు. ఏపీవో పెంచలయ్య, టీఏ చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు మసూద్, రవి: శంకర్‌రెడ్డి, పక్కీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌడవరం శంకరయ్య సేవలు మరువలేనివి

ఓబులవారిపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి):మంగంపేట మాజీ సర్పంచ్ చౌడవరం శంకరయ్య సేవలు మరువలేనివని మంగంపేట టీడీపీ నాయకులు కల్లా చలపతి, అనుమలగుండం చంద్రమోహన్, మాజీ వైస్ ఎంపీపీ గునిపాటి చిన్నరాయుడు కొనియాడారు. చౌడవరం శంకరయ్య వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ, వైసీపీ, టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులతోపాటు ఏపీఎండీసీ అధికారులు, ఉద్యోగులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత నాయకుడిగా ఏపీఎండీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో ఉద్యమాలను నడపారని గుర్తు చేశారు.

వీర జవాన్‌కు అశ్రునివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, మే9(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ కాల్పుల్లో వీరమణం పొందిన సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పుట్ల గుండ్లపల్లె పంచాయతీలోని తల్లితండాకు చెందిన మురళినాయక్‌కు జోహర్లు తెలుపుతూ శుక్రవారం రాత్రి ఏపీ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండు మీదుగా నేతాజీ సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి జోహార్లు అర్పించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెనగలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు. ఈటమాపురం గ్రామ సమీపాన గుట్టపై వెలసి ఉన్న పురాతన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఏడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నట్లు అభివృద్ధి ట్రస్టు వైస్ చైర్మన్ బత్తిన గుండాల్‌రెడ్డి తెలిపారు. అలాగే పొందలూరు గ్రామ సమీపాన గుట్టపై 5 దశాబ్దాల కిందట వెలసిన కంభం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరుగుతాయని ఆ గ్రామ పెద్దలు తెలిపారు. అలాగే నారాయణనెల్లూరు సమీపాన కంభం బోటు గుట్టపై రెండేళ్ల కిందట నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో నాలుగు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని గ్రామ పెద్దలు తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

పెనగలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంబాలకుంట దళితవాడలో గురువారం రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు, యువకులు సహకారంతో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ, అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ ఉత్సవరులతో బ్రహ్మోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం తర్వాత పురవీధుల్లో వసంతోత్సం జరుపుకున్నారు.

వైద్య సిబ్బందికి వేతనాలు చెల్లించాలి: సీపీఐ

ఓబులవారిపల్లె, మే 9 (ఆంధ్రజ్యోతి) : మంగంపేట ఏపీఎండీసీ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆసుపత్రి సిబ్బందికి పనికితగ్గ వేతనాలు చెల్లించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆసుపత్రి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరం మేరకు సిబ్బందిని పెంచుకోవాలని, వారి విద్యార్హతలు, అనుభవానికి తగ్గ వేతనాలు అందివ్వాలని కోరారు. కార్మిక సంఘాల నాయకులు పండుగోల మణి, పందికాళ్ల మణి, జయరామయ్య, గంగాధర్, మహేష్, చిన్నయ్య, చింతలపూడి నాగమ్మ, జయచంద్ర పాల్గొన్నారు.

నేటినుంచి భద్రావతి భావనారాయణ స్వామి ఉత్సవాలు

ఒంటిమిట్ట, మే 9 (ఆంధ్రజ్యోతి) : భద్రావతి భావనారాయణస్వామి ఉత్సవాలు శనివారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త శ్రీహరి తెలిపారు. మండలంలోని కొండమాచుపల్లె గ్రామంలో ఉన్న భద్రావతి భావనారాయణస్వామి ఉత్సవాలు ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం ఉత్సవాల్లో భాగంగా అంకురార్పణ నిర్వహిస్తారు. 11న ధ్వజారోహణం, సాయంత్రం శేష వాహనం, 12న హంసవాహనం, 13న చంద్రప్రభ వాహనం, 14న గరుడవాహనం, 15న కల్యాణోత్సవం, 16న రథోత్సవం, 17న వసంతోత్సవం, 18న నైవేద్యం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా రథోత్సవం

పుల్లంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక భద్రావతి సమేత భావనారుషి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం హోమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో 1500 మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం రథోత్సవంపై భద్రావతి సమేత భావనరుషి స్వామి ఊరేగారు. రథోత్సవం వెంట కోలాటం, నాట్య బృందం అలరించాయి.

అన్నమయ్య జన్మస్థలిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

●అన్నమయ్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారికి బీజేపీ నేతల వినతి



అన్నమయ్య ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు, గ్రామస్థులు

రాజంపేట, మే 9 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని అన్నమయ్య ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ మేడసాని మోహన్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, ఉద్దండం సుబ్రమణ్యం, జీకే నాగరాజు కోరారు. 108 అడుగుల అన్నమయ్య విగ్రహం, థీమ్‌పార్కును పరిశీలించడానికి వచ్చిన ఆయన్ను కలిసి సత్కరించారు. అలాగే అన్నమయ్య సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు వై.సురేష్‌రాజు, జవ్వాజి అదృష్టదీపుడు, గ్రామస్థులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమలలో అన్నమయ్య ఏర్పాటు చేసిన హుండీలో నుంచి ఒక శాతం ఆయన జన్మస్థలి తాళ్లపాక అభివృద్ధికి నిధులు కేటాయించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. 600 జయంతి ఉత్సవాలకు కేటాయించిన బడ్జెట్‌లో కనీసం 50 శాతం కేటాయిస్తే ఉత్సవాలను ఘనంగా నిర్వహించవచ్చునన్నారు. తాళ్లపాక, ఎంజీపురం, బోయనపల్లె పంచాయతీలను మెగా టౌన్‌షిప్‌గా చేస్తామని 600 జయంతి ఉత్సవాల్లో అప్పటి ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా నేటికి పట్టించుకునేవారు లేరన్నారు. ముఖద్వారం నుంచి తాళ్లపాక గ్రామం వరకు డబుల్ రహదారితో పాటు ఉద్యానవనం ఏర్పాటు, మొక్కలు పెంచుతామని చెప్పి ఆ హామీ కలగానే మిగిలిందన్నారు. ఇందుకు స్పందించిన మేడసాని మోహన్ మాట్లాడుతూ అన్ని సమస్యలపై ఈవో, చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానన్నారు. గతంలో ఏవిదంగా జయంతి, వర్ధంతి ఉత్సవాలు జరిగాయో అదేవిధంగా జరిగేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం వల్ల అధిక లాభాలు


రాజంపేట టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంపై అధిక లాభాలు ఉంటాయని జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ తెలిపారు. శనివారం మహిళా శ్రీశక్తి భవనంలో ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన సమావేశానికి సాయిలోకేశ్, డివిజన్ సెర్ప్ వేణుమాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భారత సైనికులకు మద్దతుగా నేడు ర్యాలీ

నందలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్ సందర్భంగా మన దేశానికి, సైనికులకు మద్దతుగా శనివారం సాయంత్రం 4.30 గంటలకు అరవపల్లె కృష్ణమందిరం నుంచి అంబేడ్కర్ సర్కిల్ బస్టాండ్ వరకు మన దేశ జెండాలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం అరవపల్లెలోని శ్రీకృష్ణ గీతామందిరంలో ర్యాలీపై సమావేశం నిర్వహించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ కార్యదర్శి సయ్యద్‌అమీర్, అమ్మవారిశాల ఆలయ అధ్యక్షుడు యంబలూరు నరసింహ, టీడీపీ నాయకుడు మోడపోతుల రాము, ముమ్మడిశెట్టి రమేష్, ఉప్పుశెట్టి సుధీర్, గంధం గంగాధర్, నారపుశెట్టి శివయ్య, సురేష్, సుబ్బనరసయ్య, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో వైభవంగా రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, మే9(ఆంధ్రజ్యోతి): వీరభద్రాలయంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధానార్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వా ముల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పోలేరమ్మకు ఘనంగా బోనాలు



సంబేపల్లె, మే9(ఆంధ్రజ్యోతి): దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లి గ్రామస్థులు పోలేరమ్మ తల్లికి శుక్రవారం ఘనంగా బోనాలు సమర్పించారు. 'పోలేరమ్మ తల్లీ చల్లంగా చూడమ్మా' అంటూ అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, బోనం ప్రసాదంతో నైవేద్యం సమర్పించారు.

ఎట్టకేలకు నేషనల్ హైవే సర్వే పనులు ప్రారంభం

- జూన్‌లో రోడ్డు పనులు ప్రారంభమయ్యే అవకాశం
- ఇప్పటికే మొదలైన విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు


ముద్దనూరు-పులివెందుల మధ్య సాగుతున్న సర్వే పనులు

పులివెందుల, మే 9 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-బి.కొత్తపల్లె నేషనల్ హైవే పనులు ఎట్టకేలకు ప్రారంభంకానున్నాయి. ఈ రోడ్డు పనులకు సంబంధించి తుది దశ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో నాలుగు వరుసల నేషనల్ హైవే పనులు ప్రారంభం కానున్నాయి. ఈ రోడ్డు పనుల ప్రారంభానికి అవసరమైన విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు సాగుతున్నాయి. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే ....

ముద్దనూరు-హిందూపురం వరకు నేషనల్ హైవే నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 156 కిలోమీటర్ల రహదారి నిర్మించాల్సి ఉంది. ఇందులో దాదాపు రూ.1500 కోట్లతో మూడు ప్యాకేజీలుగా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో మొదటి ప్యాకేజీ కింద ముద్దనూరు నుంచి బండమీద కొత్తపల్లె (బి.కొత్తపల్లె), రెండో ప్యాకేజీ బి.కొత్తపల్లె నుంచి గోరంట్ల వరకు, మూడో ప్యాకేజీ కింద గోరంట్ల నుంచి హిందూపురం వరకు పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయంచింది. గత ప్రభుత్వంలో మొదటి, మూడో ప్యాకేజీ టెండర్ దశలోనే ఆగిపోయాయి. కానీ రెండో ప్యాకేజీ మాత్రం బి.కొత్తపల్లె నుంచి గోరంట్ల వరకు పనులు ప్రారంభమై దాదాపు 50 నుంచి 60శాతం పూర్తయ్యాయి. ముద్దనూరు నుంచి బి.కొత్తపల్లె (బండమీద కొత్తపల్లె) మొదటి ప్యాకేజీ ఇప్పటికే పలుమార్లు టెండర్ దశలోనే పనులు ఆగిపోయాయి. ఈ కారణంగా ముద్దనూరు-బి.కొత్తపల్లె మధ్యనున్న రెండు వరుసల రహదారి రోడ్డు నిర్మాణం కాక అధ్వాన్నస్థితికి చేరుకుంది. ఈ దశలో కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం మొదటి ప్యాకేజీ అయిన ముద్దనూరు-బి.కొత్తపల్లె రహదారికి టెండర్ పూర్తయింది. ఓ ప్రైవేటు సంస్థ రూ.860 కోట్లకు 43శాతం లెస్‌తో రూ.484కోట్లకు టెండర్ దక్కించుకుంది. అంటే ముద్దనూరు-బి.కొత్తపల్లె మధ్యనున్న 56 కిలో మీటర్ల మేర నాలుగు వరుసల రహదారి రూ.484కోట్లతో పనులు చేపట్టనుంది. ప్రస్తుతం టెండర్ దశ పూర్తిచేసుకొని ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకునే పనిలో సంస్థ ఉన్నట్లు తెలిసింది. నాలుగైదు రోజుల్లో ఒప్పందం కూడా పూర్తికానున్నట్లు ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం ముద్దనూరు-బి.కొత్తపల్లె రహదారికి సంబంధించి చివరి దశ సర్వే పనులు వేగంగా సాగుతున్నాయి. అలాగే ఈ రహదారి వెంబడి ఉన్న విద్యుత్ లైన్లను షిఫ్టింగ్ చేసే పనులు కూడా ప్రారంభమయ్యాయి. ముద్దనూరు-పులివెందుల మధ్యలో ఉన్న విద్యుత్ లైన్లను షిఫ్టింగ్ చేసేందుకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. అంటే నేషనల్ హైవేకి సంబంధించిన పనులు ప్రారంభమయినట్లే అని ఆ అధికారి ధ్రువీకరించారు. కానీ ప్రభుత్వంతో కాంట్రాక్టు సంస్థకు ఒప్పందం పూర్తయిన అనంతరం కాంట్రాక్టు సంస్థ పనులు చేసేందుకు క్రషర్లను ఏర్పాటు చేయడం, యంత్రాలను ఇక్కడకు తేవడం తదితర పనులు పూర్తయిన తర్వాతనే నేషనల్ హైవే పనులు ప్రారంభమైనట్లు ప్రకటిస్తామన్నారు. రోడ్డు పనులు ప్రారంభానికి ముందు విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ తదితర పనులు చేయాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగానే విద్యుత్ లైన్‌ల షిఫ్టింగ్ పనులు సాగుతున్నాయన్నారు. ప్రస్తుతం విద్యుత్‌లైన్ల షిఫ్టింగ్ పనులు సాగుతున్నా రోడ్డు పనులు మరో రెండు నెలల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు అధికారి పేర్కొన్నారు.


తొండూరు-పులివెందుల మధ్య విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు

గాలివానకు నేలకొరిగిన మామిడిచెట్లు

- రూ.15 లక్షలు నష్టం
- ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి



ఎర్రగుడి గ్రామంలో నేలకొరిగిన మామిడిచెట్లను పరిశీలిస్తున్న అధికారులు, పదేళ్ల మామిడిచెట్టు నేలకొరిగిందని చూపుతున్న రైతు

చక్రాయపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం వీచిన గాలివానకు మామిడితోటలు భారీగా దెబ్బతిన్నాయి. అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రసాద్, హార్టికల్చర్ ఆఫీసర్ రమణలు శుక్రవారం మామిడితోటలను పరిశీలించారు. మండలంలోని ఎర్రగుడి, రాచుపల్లె, కల్లూరుపల్లెలలో గురువారం రాత్రి వర్షంతో పాటు పెనుగాలులు వీచడంతో దాదాపు 150 మామిడిచెట్లు నేలకొరిగి కాయలు రాలిపోయాయి. దాదాపు రూ.15లక్షల నష్టం వాటిల్లిందని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. అయితే పంట నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. మామిడి తోటలకు బీమా కట్టామని, కనీసం బీమా వస్తే కాస్త ఉపశమనం కలుగుతుందని రైతులు సుధాకర్‌రెడ్డి, బాబురెడ్డి, నాయక్, ప్రభాకర్‌రెడ్డిలు కోరారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


డ్రైడే-ఫ్రైడే ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులను అదుపు చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు అదుపునకు, దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమ వంతు పాటుపడాలన్నారు. ఇళ్లలోని నీటిపాత్రలు, కుండలు, బానలు వారానికి ఒకసారి శుభ్రంగా కడిగి ఆరబెట్టాలన్నారు. మురికిగుంతల్లో చెత్తా చెదారం వేయవద్దన్నారు. కాలువల్లో పేరుకు పోయి నీటి నిల్వలు పెరగడంతో దోమల కారకమైన లార్వా పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. మెడికల్ ఆఫీసరు డాక్టర్ హైమావతి, అసిస్టెంట్ మలేరియా అధి కారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసరు నాగలక్ష్మిరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

మదనపల్లె టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లె మండలం పోతబోలు హరిజనవాడ వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఎస్.గణపతి భార్య నరసమ్మను శుక్రవారం అదుపులోకి తీసుకుని 35 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భీమలింగ చెప్పారు. కురబలకోట మండలం తెట్టు గ్రామం వద్ద యు.అమరనాథ్‌ను అరెస్టు చేసి అతని నుంచి 25 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను ఇద్దరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ దాడుల్లో కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, సీఐ నాగేంద్రమ్మ, ఎస్‌ఐలు జబీవుల్లా, సతీష్, కానిస్టేబుళ్లు నాగరాజు, మధు, రేఖ, పృథ్వీ పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


రామిరెడ్డి మృతదేహం

చక్రాయపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లమడక గ్రామ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మూలి రామిరెడ్డి (63) మృతి చెందగా.. కొండారెడ్డి అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే.... కుప్పం గ్రామం ఉప్పలవాండ్లపల్లె (బురుజుపల్లె కాలనీ) నివాసి రామిరెడ్డి, వేముల మండలం చాగలేరు గ్రామా నికి చెందిన కొండారెడ్డిలు బంధువులు. వారు వేంపల్లెలో పెళ్లి చూసుకొని అనంతరం చక్రాయపేటకు బైకులో వస్తుండగా మారెళ్ల మడక గ్రామ సమీపాన అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొన్నా రు. దీంతో వాహనం నడుపుతున్న కొండారెడ్డికి తీవ్ర గాయాలు కాగా, వెనుక కూర్చున్న రామిరెడ్డి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాయలకుంట్ల గ్రామంలో చోరీ

- రూ.60 వేలు నగదు అపహరణ


బీరువాలోని వస్తువులను చెల్లాచెదరుగా పడేసిన దృశ్యం

బి.కోడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాయలకుంట్ల గ్రామంలో గురువారం రాత్రి తాతిబోయిన ఓబులేసు ఇంటిలో చోరీ జరిగింది. ఓబులేసు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రాత్రి బద్వేలుకు పెళ్లికి వెళ్లారు. గమనించిన దొంగలు రాత్రికి ఆ ఇంటిలో చొరబడి బీరువాను పగలగొట్టి రూ.60వేలు చోరీకి పాల్పడ్డారు. తమ కుమారుడు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుండగా.. ఫీజు కట్టేందుకు పత్తి డబ్బులు రూ.60వేలు తీసుకువచ్చి ఇంటిలో పెట్టుకున్నామని.. ఆ డబ్బులు చోరీ చేశారని బాధితుడు వాపోయారు. ఈమేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటసురేశ్ తెలిపారు.

కరెంటు వైర్లు తగిలి బేల్దారి మృతి

కడప క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పులివెందుల రోడ్డులోని మెడికల్ కళాశాల వద్ద బేల్దారి పనిచేసుకుంటున్న వ్యక్తికి కరెంటు వైర్లు తగిలి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... రామరాజుపల్లెకు చెందిన నీలం ఓబులేసు (35) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం వైద్యకళాశాల వద్ద బేల్దారి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కరంటు వైర్లు తగిలి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి...



లింగాల, మే 9 (ఆంధ్రజ్యోతి): చేపల కోసం చెరువులోకి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. ఎస్‌ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు.... కదిరి మండలం చెలంకూరు గ్రామానికి చెందిన యల్లనూరు హజరతయ్య అనే వ్యక్తి బేల్దారి పనికోసం లింగాల మండలంలోని కామసముద్రం గ్రామానికి వచ్చాడు. అయితే శుక్రవారం పనిలేక పోవడంతో చేపల కోసం చెరువు దగ్గరకు వెళ్లాడు. ప్రమాదవాత్తు చెరువులో పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఉరివేసుకొని దివ్యాంగుడి ఆత్మహత్య



సాముల ప్రతాప్ మృతదేహం

పులివెందుల, మే 9 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణానికి చెందిన సాముల ప్రతాప్ (32) అనే మూగవ్యక్తి శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు ... పట్టణంలోని పురుషోత్తంరెడ్డి కాలనీకి చెందిన సాముల ప్రతాప్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఉరి వేసుకున్నాడు. అతనికి భార్య ధనలక్ష్మి(మూగవారే), నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రతాప్‌తో పాటు ఇటీవల కుమారుడికి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. దీనికితోడు అతనికి ఉన్న ఒకే ఒక్క స్నేహితుడు ఇటీవల చనిపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడప వీఅండ్ఎస్‌వో సస్పెన్షన్

కడప (మారుతీనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసరుగా విధులు నిర్వహిస్తున్న ముజుబర్ రెహమాన్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆ మేరకు ఆర్టీసీ రాష్ట్ర ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై గతంలో పలు అవినీతి ఆరోపణలు రావడంతో పాటు పలువురు ఉద్యోగుల వద్ద మామూళ్లు వసూళ్లు చేశారని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పైస్థాయి అధికారులు విచారణ చేపట్టారు. అందులో నిజాలు నిగ్గు తేలడంతో రాష్ట్ర ఉన్నతాధికారులు ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. యువకుడి మృతి


మృతిచెందిన ప్రభుదాస్ (ఫైల్)

నందలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): కడప- చెన్నై ప్రధాన రహదారి నందలూరు బాహుదానది వంతెన సమీపంలో శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు, మోపెడ్(టీవీఎస్ ఎక్స్ ఎల్) ఢీకొన్న సంఘటనలో గురునాథం ప్రభుదాస్ (22) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... రాజంపేట మండలం బోయనపల్లె ప్రాంతానికి చెందిన ప్రభుదాస్ నందలూరులోని తమ బంధువుల వద్దకు వచ్చి తిరిగి రాజంపేటకు వెళుతున్న సమయంలో తిరుపతి నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రగాయాల పాలైన అతన్ని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ప్రభుదాస్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన వెంగముని

పులివెందుల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇ.కొత్తపల్లె క్రాస్ రోడ్డు ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన పసలపాటి వెంగముని (38) అనే వ్యక్తి తన మోటార్ సైకిల్లో పులివెందుల నుంచి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. అయితే వాహనం అదుపు తప్పి కింద పడ్డాడా లేక గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడా అనే విషయం తెలియరాలేదని పోలీసులు తెలిపారు.


రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రైల్వేస్టేషన్, బస్సుల్లో విస్తృత తనిఖీలు

ఎర్రగుంట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): కడప ఎస్పీ ఆదేశాల మేరకు ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్, ప్రైవేటు ట్రావెలింగ్ బస్సుల్లో ఎర్రగుంట్ల పోలీసులు, రైల్వే ఆర్‌పీఎఫ్, జీఆర్ పీఎఫ్ పోలీసులు గురువారం రాత్రి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో అనుమానితులు, అపరి చితులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమానితుల బ్యాగులను తనిఖీలు చేశారు. ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడళ్లలో సీఐ నరేష్ బాబు ఆధ్వర్యంలో ప్రైవేటు బస్సులలో విస్తృత తనిఖీలు చేపట్టారు. వాహనాల డిక్కీలను తెరచి బ్యాగులను పరిశీలించారు. కొందరి సెల్‌ఫోన్లను పోలీసులు తనిఖీ చేశారు.


ఆలయ ఈవోకు చెక్కును అందజేస్తున్న మండిపల్లి రాహుల్‌రెడ్డి దంపతులు

శాశ్వత అన్నదానానికి రూ.1,11,116 విరాళం

రాయచోటిటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న శాశ్వత అన్నదానానికి మండిపల్లి రాహుల్‌రెడ్డి, మైత్రేయి దంపతులు రూ.1,11,116 విరాళం అందజేశారు. వీరు తన కుమారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే మండిపల్లి నారాయణరెడ్డి మనవడు అయిన మండిపల్లి కుశాల్‌రెడ్డి పేరు మీద శుక్రవారం వీరభద్రస్వామి ఆలయ ఈవో డీవీ రమణారెడ్డికి చెక్కు రూపంలో ఈ మొత్తం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు కృష్ణయ్య, శంకరయ్య స్వాములు వారిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలికా వికాసం.. భవితకు సోపానం

- కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో, సూపర్‌వైజర్లు
- జిల్లా వ్యాప్తంగా బాలికలకు వేసవి శిక్షణ

ప్రొద్దుటూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పసిప్రాయంలో లైంగిక వేధింపులు... ముక్కుపచ్చలారని చిన్నారికి మూడుముళ్లు.. ప్రేమపేరుతో వంచన.. ఏం చేయాలో తెలియక బాల్యం తల్లడిల్లుతోంది, వారిలో చైతన్యం తెచ్చే దిశగా బాలికల రక్షణ, వారి అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా కిశోర బాలిక వికాసం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ కార్యక్రమం మరుగున పడింది. కూటమి సర్కార్ దీన్ని పునఃప్రారంభించింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికా వికాసం సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది.



'పరిచయం'తో మొదలు

సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కల్పిస్తారు. ఆత్మస్థైర్యం పెంపొందించ డమే లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేస్తారు. మహిళ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జూన్ 10 వరకు నిర్వహించే కార్యక్రమాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. తొలి రోజు బాలికలకు పరిచయం ఏర్పాటు చేశారు. 11 నుంచి 18 ఏళ్ల వయస్సుగల కిశోర బాలికలకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహించి పలు అంశాలపైన శిక్షణ ఇస్తారు. 12 అంశాలపై కలిగించే అవగాహనలో ముందుగా దీనిపై అంగన్వాడీ, ఏఎన్‌ఎం, మహిళా పోలీసు, ఆశా, ఏడబ్ల్యూడబ్ల్యూ, వీఏవోలకు శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా ఆయా సచివాలయాల పరిధి, గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆర్పీలు, తదితరులను భాగస్వాములను చేశారు. వీరు ప్రభుత్వ పాఠశాలల, గ్రామీణ, జనం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తారు.

ఆత్మస్థైర్యం నింపేలా...

కౌమార బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా.. వారిపై జరిగే అఘాయిత్యాలను ఎదుర్కొనేలా తయారు చేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. బాల్య వివాహాలకు అడ్డుకట్ట, లింగ సమానత్వం పెంపొందించేందుకు దోహదపడుతుంది.

– వి.అరుణకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో, ప్రొద్దుటూరు రూరల్

గ్రామస్థాయిలో కమిటీలు

'కిశోర వికాసం' నిర్వహణకు గ్రామ వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా 5 నుంచి 20 మంది కమిటీ సభ్యులతో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. అంగన్ వాడీ, ఆరోగ్యకార్యకర్తలు ఇందులో ముఖ్యపాత్ర పోషిస్తారు. వసతులను దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రం లేదా గ్రామ, వార్డు సచివాలయాల్లో శిక్షణ తరగ తులు నిర్వహిస్తున్నారు. తమ నివాస ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నా, లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు గుర్తించిన వెంటనే గ్రూపు సభ్యులు అధికారులకు సమాచారం అందిస్తారు. వెంటనే అడ్డుకట్ట చర్యలు తీసుకుంటారు.

కార్యక్రమాల అమలు ఇలా ...

ఈనెల 6న రుతుక్రమం-శుభ్రత, లైంగిక విద్య 9న బాల్య వివాహాలు, ఆరోగ్యం-ప్రభావాలు 13న పిల్లల హక్కులు, లైంగికవేధింపుల నుంచి రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన 16న కౌమారంలో రక్తహీనత కలుగకుండా జాగ్రత్తలు 20న లింగవివక్ష, అసమానతలు, ఆడపిల్లపై వివక్ష 23న ఉన్నత విద్య, నైపుణ్యాలు, భవిష్యత్తు మార్గదర్శకం 27న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, సమస్యలు, 30న ఆర్థిక అంశాల నిర్వహణ జూన్ 3న బాలికల నాయకత్వ లక్షణాలు, సాధికారకత 6న క్రీడలు, యోగా, వ్యాయమం 10న బాల్యవివాహాల సమస్యలు- నిర్మూలన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

శేషవాహనంపై వేంకటేశ్వరుడి విహారం



శేషవాహనంపై ఊరేగుతున్న వెంకన్న

మదనపల్లె అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి):స్థానిక దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ఈవో రమణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం నెహ్రూనగర్ వాసులు శేషవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. రాత్రి బండమీద కమ్మపల్లె వాసులు హంస వాహనంపై స్వామిని ఊరేగించారు. ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ బింగిపొండు, కౌన్సిలర్ తులసీరామకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నరసింహుడి రథోత్సవం



రథం లాగుతున్న భక్తులు

మదనపల్లె అర్బన్, మే 9(ఆంధ్రజ్యోతి): లక్ష్మీ నరసింహస్వామి ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని సీటీఎంలో రథోత్సవాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

మారెమ్మ తిరునాళ్లు ప్రారంభం



ప్రత్యేక అంకరణలో మారెమ్మ అమ్మవారు

ములకలచెరువు, మే 9(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పరికోటలో శుక్రవారం మారెమ్మ తిరునాళ్ల ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో గోపూజ, స్వస్తివాచకం, ఆలయ శుద్ధి, గణపతి పూజ, నాంది, రక్షాబంధనము, కలశస్థాపన, హోమాలు, అష్టోత్తర పారా యణం, కుంకుమార్చన, మహా మంగళ హారతి తదితర కార్యక్రమాలు జరిగాయి. శని, ఆది వారాల్లో కూడా ఉత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

12 నుంచి కోదండరామాలయ బ్రహ్మోత్సవాలు

ములకలచెరువు, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపల్లెలోని కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 12న మహాభిషేకము, నూతన వసాలంకరణ, సీతారామ కల్యాణోత్సవం, గరుడ వాహన గ్రామోత్సం, 13న పుష్పాలంకరణ, అర్చనలు, పసుపు కొట్టుట, వేద పారాయణ తీర్థప్రసాద వినియోగం, హనుమద్వాహన గ్రామోత్సవము, 14న శ్రీవారి బ్రహ్మ రథోత్సవం, తిరునాల తదితర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. గ్రామస్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

చింతపర్తి వైద్యాధికారిగా సాయిశ్రీ



వాల్మీకిపురం, మే 9 (ఆంధ్ర జ్యోతి):మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా సాయిశ్రీ శుక్రవారం బాధ్యతలుస్వీకరించారు.అనంతరం మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని, ఎక్కువ కాన్పులు ప్రభుత్వాస్పత్రిలోనే అయ్యే విధంగా దృష్టి సారిస్తానన్నారు. ప్రజలకు వైద్య సేవలందించే విషయంలో ఆస్పత్రి సిబ్బంది కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వాల్మీకిపురం, మే 9(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ తెలియజేశారు. వాల్మీకిపురం, చింతపర్తి, గండబోయనపల్లె, మంచూరు, నగిరిమడుగు, కూరపర్తి తదితర గ్రామాలలోని విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉద యం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుం దని తెలియజేశారు. వేసవి కాలం, విద్యుత్ లైన్లపై కొమ్మల తొలగింపు, వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయానికి ప్రజలు కూడా సహకరించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

డీఎస్పీతో హజ్‌కమిటీ సభ్యుడి భేటీ

మదనపల్లె, మే 9(ఆంధ్రజ్యోతి): హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, మదనపల్లె డీఎస్పీ ఎస్.మహేంద్రను కలిశారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసి, స్థానికంగా ఉన్న సమస్యలను వివరించారు.

బీటీ కళాశాల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిస్థితిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం కళాశాలను సందర్శించిన ఆయన అక్కడ అందుబాటులో వున్న కోర్సులు, బోధనా, బోధనేతర సిబ్బంది, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం బీటీ డిగ్రీ కళాశాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఈ కళాశాల బాగుపడాలంటే మదనపల్లెతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు బాధ్యత వహించాల్సి ఉందన్నారు. విద్యార్థులందరికి ఉచిత విద్య అందిస్తున్న బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరు తమవంతు పాత్ర వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి, బీజేపీ నేత ఎన్.సేతు, వినోద్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోని వార్డుల పరిశీలన

మదనపల్లె అర్బన్ : స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని అన్ని వార్డులను అందులో సౌకర్యాలను ఎమ్మెల్యే షాజహాన్ బాషా పరిశీలించారు. ఐసీయూ, మెటర్నిటీ క్యాజువాలిటీ వార్డుల్లో రోగులకు అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. సూపరింటెండెంట్ డాక్టర్ కోటేశ్వరితో చర్చించారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో రోగులకు తగ్గట్టు డాక్టర్లు లేరన్నారు. ఉన్నంతలో మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. రోగులను రెఫర్ చేయడం తగ్గించాలన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి డాక్టర్ల నియామకానికి కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం ఆస్పత్రికి రూ. 30లక్షల విలువైన మందులు వస్తున్నట్లు వివరించారు. ఈ ఆస్పత్రిని పీపీపీపీ మోడల్‌కు అంగీకరించలేదని, రోగులు అందరూ డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోనే పరిస్థితి లేదన్నారు. సింధూర్ ఆపరేషన్ విజయవంతం కావడం ఆనందంగా ఉందన్నారు. భారత సైనికులకు జోహార్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నవీన్ చౌదరి, విజయభారతీ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సేతు, చిప్పిలి చెంద్రాయులు, దుబ్బిగాళ్ల భాస్కర్, మునలికుంట నాగయ్య, సురేంద్రరెడ్డి, బండి పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుడు మురళీ నాయక్‌కు ఘన నివాళి



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజలు

పీలేరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరుడు మురళీ నాయక్ అని పలువురు ప్రశంసించారు. పాకిస్తాన్ సైనికుల కాల్పుల్లో వీరమణం పొందిన మురళీ నాయక్ చిత్రపటానికి పీలేరు నాలుగు రోడ్ల కూడలిలోని గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల వెలుగులో స్థానికులు ఘనంగా నివాళులర్పించారు. అమర్ రహే మురళీనాయక్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం, కల్లితండాకు చెందిన మురళీ నాయక్ పాక్ కాల్పుల్లో వీర మరణం పొందారు. మురళీ కుటుంబానికి యావత్ భారతదేశం అండగా ఉంటుంద న్నారు. అమర వీరుల త్యాగాలను గుర్తించి పాక్‌ను చిత్తుచిత్తుగా ఓడించి ప్రపంచ పటంలో లేకుండా చేయాలన్నారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సుంకర చక్రధర్, చిన్నలోకనాథరెడ్డి, ఆనంద్, షాకీర్, భువన పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: స్థానిక బెంగళూరు బస్టాండ్‌లో శుక్రవారం సాయంత్రం ముస్లిం సోదరులతో కలిసి పాక్ కాల్పుల్లో అమరుడైన ఏపీ జవాన్ మురళినాయక్‌కు స్థానిక ఎమ్మెల్యే జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీరజవాన్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు పఠాన్‌ఖాదర్‌ఖాన్, షంషీర్, బాబా, మస్తాన్, అమీర్, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకూ సబ్సిడీపై పశు దాణా పంపిణీ

కలికిరి, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ 50 శాతం సబ్సిడీతో పశు దాణాను పంపిణీ చేయనున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ గిరినాథ రెడ్డి తెలిపారు. మండలానికి 400 టన్నుల దాణా అవసరమవుతుందని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మొదటి విడతగా 25 టన్నులు మాత్రమే వచ్చిందని దాన్ని గుట్టపాలెం పంచాయతీలో పంపిణీ చేశామన్నారు. ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దవారిఎల్లె పంచాయతీలో తాగునీటి బోర్లు అడుగంటిపోతున్నాయని సర్పంచు గంగయ్య అధికారుల దృష్టికి తెచ్చారు. విద్యుత్ అదనపు లోడు చెల్లించేవారికి ప్రస్తుతం యాభై శాతం మినహాయింపు ఉందని అవసరమైన వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకో వాలని ట్రాన్స్‌కో జేఈ గోవర్ధన్ తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం కండక్టర్ వైరు కొరతగా ఉందని చెప్పారు. ప్రైవేటు పాఠశాలల్లోని ఒకటవ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని ఎంఈవో కరీముల్లా వెల్లడించారు. పండ్లతోటలు పెట్టుకొనే అర్హులైన రైతులకు ఉపాధి హామీ కింద 200 ఎకరాలు కేటాయించినట్లు ఏపీవో మంజుల తెలిపారు. వంద ఎకరాల్లో గడ్డి పెంచుకునే వీలుందన్నారు. కొత్త ఇళ్ల కోసం మండలంలో 1450 దరఖాస్తులు అందాయని వాటన్నిటినీ పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని హౌసింగ్ ఏఈ చంద్రశేఖ రెడ్డి తెలిపారు. క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నట్లు మేడికుర్తి వైద్యాధికారి డాక్టర్ చిన్నరెడ్డెప్ప వెల్లడించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎంపీడీవో భానుమూర్తి రావు విశదీకరించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఏవో సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

‘తల్లీబిడ్డల ఆరోగ్యమే ఐసీడీఎస్ లక్ష్యం’



పోటోరైటప్: కిశోరబాలికలనుద్దేశించి మాట్లాడుతున్న సీడీపీవో భాగ్యమ్మ

బి.కొత్తకోట, మే9 (ఆంధ్ర జ్యోతి): తల్లీ బిడ్డల ఆరోగ్యమే ఐసీడీఎస్ లక్ష్యం అని, ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంతో తల్లీబిడ్డల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని బి.కొత్తకోట సీడీపీవో భాగ్యమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని గట్టు1 అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. సెంటర్ పరిధిలోని కిశోరి బాలికలను సమావేశపరిచి, యుక్త వయస్సులో బాలికలలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన ఆరోగ్యనియమాలను వివరించారు. 11-18 ఏళ్ల వయస్సులో బాలికలు ఆకర్షణకు లోనై ఇతరుల చేతిలో మోసపోరాదని, ప్రభుత్వం రూపొందించిన దిశాయాప్, హెల్ప్‌లైన్ నెంబర్లు గురించి వివరించారు. సీడీపీవో మాట్లాడుతూ తల్లులు, శిశువులలో రోగ నిరోధకశక్తి పెంచుకునేలా పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని, అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల సూచలనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయరాణి, ఏఎన్ఎం మాలతి, మహిళాపోలీస్, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: బాల్యవివాహాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడి సూపర్‌వైజర్ నాగరత్న వెల్లడించారు.పెద్దతిప్పసముద్రం మండలం తుమ్మరకుంట గ్రామం లోని బండమీదపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరీ వికాసంపై కిశోర బాలికలు, అంగన్‌వాడి కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నాగరత్నమ్మ మాట్లాడుతూ బాలికలు బాల్య వివాహాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్న వయసులో గర్భధారణ, పునరుత్పత్తి, ఆరోగ్య సమస్యలు సహా ఇతర ప్రమాదాలపై వివరించారు. బాలికలు చిన్న వయస్సులో గర్భం దాల్చడం వలన మాతాశిశు మరణాలు సంభవి స్తాయన్నారు. జీవిత కాల ఆరోగ్య సమస్యలపై వివరించారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితం



వాల్మీకిపురం: పరీక్షలు చేస్తున్న డాక్టర్ జులేఖాబేగం



గర్భిణులకు పోషకాహారం అందిస్తున్న డాక్టర్ రమేష్ రెడ్డి

వాల్మీకిపురం, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవం తల్లీబిడ్డకు సురక్షితమని వాల్మీకిపురం మండలం చింతపర్తి పీహెచ్‌సీ డాక్టర్ జులేఖాబేగం తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వాస్పత్రులలో ప్రసవాలకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, వైద్య సిబ్బంది బానుబీ, అరుణ , సురేష్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

పీలేరు రూరల్: గర్భిణులు నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం తలపుల పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల రకహీనత, రక్తపోటు, (బీసీ) మధుమేహం వంటి తీవ్రమైన సమస్యలను తొలిదశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందించవచ్చునని తెలిపారు. పోషకాహారం తీసుకోవాలని సూచించారు. తద్వారా సురక్షితమైన ప్రసవం, ఆరోగ్యమైన శిశువు జననం సాధ్యమౌతుందని తెలిపారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. చైతన్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు కే. రాజమ్మ సహకారంతో 27 మంది గర్భిణులకు పండ్లు, పాలు, బ్రెడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్ఎంలు నాగవేణి, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

మదనపల్లె అర్బన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాహుకాల సమయంలో మహిళలు పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో 10 మందికి ఉద్యోగాలు

పీలేరు, మే 9(ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన ఆల్ డిజీ టెక్నో సంస్థ శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో తమ విద్యార్థులు 10 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని పీలేరులోని ఓ ప్రైవేటు కళాశాల కరస్పాండెంట్ విజయ భాస్కర రెడ్డి తెలి పారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.2 లక్షల వేతనం అందుతుందని ఆయన వివరించారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, మే9 (ఆంధ్రజ్యోతి): కారు ఢీ కొన్న సంఘటనలో యువకుడు గాయపడినట్లు ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని మోతీ నగర్‌కు లతీఫ్(30) శుక్రవారం బైక్‌పై అంగళ్లకు వెళుతుండగా విశ్వం ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో కురబలకోట వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన అతనిని స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెడ్డెప్పనాయుడు కాలనీలో ఆక్రమణల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

మదనపల్లె, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డెప్పనాయుడు కాలనీలో ఆక్రమణల తొల గిం పునకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. ఆ కాలనీలోని వివిధ వీధుల్లో ముగ్గురు కాలువలు ఆక్రమించి గార్డెన్, పార్కింగ్ ఏర్పాటు చేసు కోవడంపై సంపన్నుల కక్కుర్తి అనే శీర్షికన గతనెల 29న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారి ఎస్.జకీరాబేగం, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, సచివాలయ సిబ్బంది శనివారం చర్యలకు శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారి నుంచి రెడ్డెప్పనాయుడు కాలనీలోకి వెళ్లే 40 అడుగుల రోడ్డుకు అటు, ఇటు ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను ఎక్స్ కవేటర్‌తో తొలగించారు. కాలనీలోని వీధుల్లో ఉన్న ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు తొలగి స్తామని తెలియజేశారు.

గతుకుల రోడ్లను బాగు చేయండి



సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీవైఎస్ నాయకులు

మదనపల్లె టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని కోమటివానిచెరువు కట్టపై వేసిన తారు రోడ్డు గతుకులమయం అయిపోయిందని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట బీవైఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ కోమటివానిచెరువు కట్టపై ఆరేళ్ల క్రితం విరాళాలతో నిర్మించిన రోడ్డు ఇప్పుడు పూర్తిగా గుంతలుపడిపోయిందన్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఈ గోతులతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కట్టకు ఇరువైపులా వున్న రెయిలింగ్ ఊడిపోవడంతో వాహనాలు కిందికి పడిపోయే ప్రమాదం ఉందన్నారు. మదనపల్లె-నిమ్మనపల్లె మార్గంలోని రోడ్డు వందల చోట్ల దెబ్బతినిందన్నారు. ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే సర్కస్‌ఫీట్లు చేయాల్సి వస్తోందన్నారు.దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టరేట్ డీఏవో రాఘవేంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరికృష్ణ, శ్రీనివాసులు, శశికుమార్, బాలకృష్ణ, వినయ్, ఉదయ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు

ఆలయ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

నిమ్మనపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం అటవీ ప్రాంతంలో ఉన్న నేలమల్లేశ్వర స్వామి ఆలయ ఎన్నికకు దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఈవో మంజుల తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే నూతనంగా కమిటీ ఏర్పాటు సన్నాహాలు చేసిందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 27వ తేదీ లోగా అన్నమయ్య జిల్లా దేవదాయ శాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

నిమ్మనపల్లి, మే 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలి ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనదారులకు పలు సూచనలు సలహాలు అందించారు. ద్విచక్రవాహనం నడిపే వారు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టును ధరించాలన్నారు.డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ వంటి పత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్లే వాహనాలన్నీ సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని వారి కారణంగా ప్రమాదాలు జరిగితే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ఆటో డ్రైవర్లు తప్పని సరిగా యూనిఫాం ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా అధిక లోడుతో వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

పీలేరు రూరల్, మే 09 (ఆంధ్యజ్యోతి): ఈ నెల 11వ తేదీన పౌర్ణమి సందర్భంగా అరుణాచల గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం పీలేరు నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం నిర్మల తెలిపారు. శుక్రవారం ఆమె పీలేరులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రతి నెలా పీలేరు నుంచి తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర స్వామి గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ బస్సు నడుపుతున్నామని తెలిపారు. 11వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు పీలేరు నుంచి బస్సు బయలు దేరుతుందని, రాను పోను రూ. 700 చెల్లించి సీటు రిజర్వేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాల కోసం బస్ స్టేషన్ మేనేజర్ 9441774743 నెంబర్‌కు సంప్రదించాలని ఆమె కోరారు.

సమాజానికి ఉపాధ్యాయులే మార్గదర్శకులు



డీవైఈవో లోకేశ్వర్ రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

పీలేరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉపాధ్యాయులే మార్గదర్శకులని మదనపల్లె డీవైఈవో లోకేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పీలేరు ఎమ్మార్సీ వద్ద ఆయనను యూటీఎఫ్, ఎస్టీయూ, మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేర్వేరుగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాత పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయులతోపాటు స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, పెద్దలు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఆయనను సన్మానించారు. పీలేరు ఎంఈవో -2 పద్మావతి, యూటీఎఫ్ నేతలు శివారెడ్డి, వేణుగోపాల్, సుధాకర్, మస్తాన్, ఎస్టీయూ నేతలు బాలకృష్ణారెడ్డి, అరవ వేణుగోపాల్‌రెడ్డి, వెంకట్రమణ, భాస్కర్ రెడ్డి, మానవత సంస్థ ఛైర్మన్ వీ. రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపాలి



మహిళా రైతును సన్మానిస్తున్న ఏవో లావణ్య

కలకడ, మే 9(ఆంధ్రజ్యోతి) ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని ఎంఏవో లావణ్య అన్నారు. ఖరీఫ్ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలకడలో రైతులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ విధానంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చునన్నారు. సాగుకు ముందు అవలంబించే పీఎండీఎస్ (నవధాన్యాలు) పద్ధతిలో ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. దీంతో ప్రతి సీజన్‌లో భూమిలో పోషకాలు పెంపొంది పంటల వైవిధ్యం మెరుగుపడుతుందన్నారు. ఇటీవలి కాలంలో సేంద్రియ వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించిన మహిళా రైతును సన్మానించారు. ఏపీఎం పురుషో త్తంరెడ్డి, రైతుసాధికార సంస్థ సభ్యులు హరిప్రియ, సుబ్బరామయ్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన మహిళలందరికీ టైలరింగ్ లో శిక్షణ



కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ రజియా

బి.కొత్తకోట, మే9(ఆంధ్రజ్యోతి): ఆసక్తి వున్న మహిళలందరికి టైలరింగ్‌లో శిక్షణనిచ్చి బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్ ఇవ్వనున్నట్లు కుట్టుశిక్షణ కోఆర్డినేటర్ రజియా తెలిపారు. బి.కొత్తకోటలో న్విహిస్తున్న శిక్షణ కేంద్రంలో అవకతవకలున్నట్లు ఆరోపణలున్న నేపథ్యంలో శుక్రవారం ఆమె బి.కొత్తకోటకు వచ్చారు. ఫిర్యాదుదారులతో మాట్లాడారు. మరో బ్యాచ్‌తో రెండవ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తా మన్నారు. మహిళలకు 90 రోజుల శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు కుట్టుమిషన్ ను ఉచితంగా ఇస్తామన్నారు. 70 శాతం హాజరు ఉండితీరాలని, నెలకు రూ.3 వేలు ఇవ్వడం అంతా ఉత్తిదేనన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో వెంటనే చర్యలు తీసుకోవాలి

పీలేరు, మే 9(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకుడు సుధాకర్, ఆయన బంధువులను కులం పేరుతో దూషించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పీలేరులోని ఎంఆర్‌పీఎస్ నాయకులు ముల్లంగి చంద్రయ్య, మాలమహానాడు నాయకులు జెట్టి మల్లికార్జున పోలీసులను కోరారు. పీలేరులో శుక్రవారం ఆయనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన జనసేన నేత కామిశెట్టి సుధాకర్‌ను అడ్డుకున్నందుకు కులం పేరుతో దూషించాడన్నారు. ఆ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందదితుడిని అరెస్టు చేయడంలో ఆలస్యం చేస్తున్నారన్నారు. ప్రజాసంఘాల నాయకులు శ్రీకాంత్, మల్లిఖార్జున, తిమ్మయ్య ప్రసాద్, చిరంజీవి, ఓబులేశు, పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయండి

మదనపల్లె టౌన్, మే 9(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ తెలుపు రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. శుక్రవారం రాత్రి తన నివాసం వద్ద నియోజకవర్గంలోని ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలో అర్హులైన వారికి పెద్దఎత్తున రేషన్‌కార్డులు మంజూరు చేయించానన్నారు. ఇప్పుడు కూడా అర్హులకు రేషన్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు, పేర్లు సవరణ, కార్డు విభజనలు, మార్పులుచేర్పుల్లో రెవెన్యూ అధికారులు ప్రజలకు మంచి చేయాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్లు ధనంజయులు, అమరనాథ్, నిర్మల, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు నేషనల్ హైవే సర్వే పనులు ప్రారంభం

- జూన్‌లో రోడ్డు పనులు ప్రారంభమయ్యే అవకాశం
- ఇప్పటికే మొదలైన విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు


ముద్దనూరు-పులివెందుల మధ్య సాగుతున్న సర్వే పనులు

పులివెందుల, మే 9 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-బి.కొత్తపల్లె నేషనల్ హైవే పనులు ఎట్టకేలకు ప్రారంభంకానున్నాయి. ఈ రోడ్డు పనులకు సంబంధించి తుది దశ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో రెండు నెలల్లో నాలుగు వరుసల నేషనల్ హైవే పనులు ప్రారంభం కానున్నాయి. ఈ రోడ్డు పనుల ప్రారంభానికి అవసరమైన విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు సాగుతున్నాయి. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే ....

ముద్దనూరు-హిందూపురం వరకు నేషనల్ హైవే నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 156 కిలోమీటర్ల రహదారి నిర్మించాల్సి ఉంది. ఇందులో దాదాపు రూ.1500 కోట్లతో మూడు ప్యాకేజీలుగా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందులో మొదటి ప్యాకేజీ కింద ముద్దనూరు నుంచి బండమీద కొత్తపల్లె (బి.కొత్తపల్లె), రెండో ప్యాకేజీ బి.కొత్తపల్లె నుంచి గోరంట్ల వరకు, మూడో ప్యాకేజీ కింద గోరంట్ల నుంచి హిందూపురం వరకు పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వంలో మొదటి, మూడో ప్యాకేజీ టెండర్ దశలోనే ఆగిపోయాయి. కానీ రెండో ప్యాకేజీ మాత్రం బి.కొత్తపల్లె నుంచి గోరంట్ల వరకు పనులు ప్రారంభమై దాదాపు 50 నుంచి 60శాతం పూర్తయ్యాయి. ముద్దనూరు నుంచి బి.కొత్తపల్లె (బండమీద కొత్తపల్లె) మొదటి ప్యాకేజీ ఇప్పటికే పలుమార్లు టెండర్ దశలోనే పనులు ఆగిపోయాయి. ఈ కారణంగా ముద్దనూరు-బి.కొత్తపల్లె మధ్యనున్న రెండు వరుసల రహదారి రోడ్డు నిర్మాణం కాక అధ్వాన్నస్థితికి చేరుకుంది. ఈ దశలో కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం మొదటి ప్యాకేజీ అయిన ముద్దనూరు-బి.కొత్తపల్లె రహదారికి టెండర్ పూర్తయింది. ఓ ప్రైవేటు సంస్థ రూ.860 కోట్లకు 43శాతం లెస్‌తో రూ.484కోట్లకు టెండర్ దక్కించుకుంది. అంటే ముద్దనూరు-బి.కొత్తపల్లె మధ్యనున్న 56 కిలో మీటర్ల మేర నాలుగు వరుసల రహదారి రూ.484కోట్లతో పనులు చేపట్టనుంది. ప్రస్తుతం టెండర్ దశ పూర్తిచేసుకొని ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకునే పనిలో సంస్థ ఉన్నట్లు తెలిసింది. నాలుగైదు రోజుల్లో ఒప్పందం కూడా పూర్తికానున్నట్లు ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం ముద్దనూరు-బి.కొత్తపల్లె రహదారికి సంబంధించి చివరి దశ సర్వే పనులు వేగంగా సాగుతున్నాయి. అలాగే ఈ రహదారి వెంబడి ఉన్న విద్యుత్ లైన్లను షిఫ్టింగ్ చేసే పనులు కూడా ప్రారంభమయ్యాయి. ముద్దనూరు-పులివెందుల మధ్యలో ఉన్న విద్యుత్ లైన్లను షిఫ్టింగ్ చేసేందుకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. అంటే నేషనల్ హైవేకి సంబంధించిన పనులు ప్రారంభమయినట్లే అని ఆ అధికారి ధ్రువీకరించారు. కానీ ప్రభుత్వంతో కాంట్రాక్టు సంస్థకు ఒప్పందం పూర్తయిన అనంతరం కాంట్రాక్టు సంస్థ పనులు చేసేందుకు క్రషర్లను ఏర్పాటు చేయడం, యంత్రాలను ఇక్కడకు తేవడం తదితర పనులు పూర్తయిన తర్వాతనే నేషనల్ హైవే పనులు ప్రారంభమైనట్లు ప్రకటిస్తామన్నారు. రోడ్డు పనులు ప్రారంభానికి ముందు విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ తదితర పనులు చేయాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగానే విద్యుత్ లైన్‌ల షిఫ్టింగ్ పనులు సాగుతున్నాయన్నారు. ప్రస్తుతం విద్యుత్‌లైన్ల షిఫ్టింగ్ పనులు సాగుతున్నా రోడ్డు పనులు మరో రెండు నెలల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు అధికారి పేర్కొన్నారు.


తొండూరు-పులివెందుల మధ్య విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు

గాలివానకు నేలకొరిగిన మామిడిచెట్లు

- రూ.15 లక్షలు నష్టం ● ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి


ఎర్రగుడి గ్రామంలో నేలకొరిగిన మామిడిచెట్లను పరిశీలిస్తున్న అధికారులు, పదేళ్ల మామిడిచెట్టు నేలకొరిగిందని చూపుతున్న రైతు

చక్రాయపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం వీచిన గాలివానకు మామిడితోటలు భారీగా దెబ్బతిన్నాయి. అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రసాద్, హార్టికల్చర్ ఆఫీసర్ రమణలు శుక్రవారం మామిడితోటలను పరిశీలించారు. మండలంలోని ఎర్రగుడి, రాచపల్లె, కల్లూరుపల్లెలలో గురువారం రాత్రి వర్షంతో పాటు పెనుగాలులు వీచడంతో దాదాపు 150 మామిడిచెట్లు నేలకొరిగి కాయలు రాలిపోయాయి. దాదాపు రూ.15లక్షల నష్టం వాటిల్లిందని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. అయితే పంట నష్టపరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. మామిడి తోటలకు బీమా కట్టామని, కనీసం బీమా వస్తే కాస్త ఉపశమనం కలుగుతుందని రైతులు సుధాకర్‌రెడ్డి, బాబురెడ్డి, నాయక్, ప్రభాకర్‌రెడ్డిలు కోరారు.

దేవదాయ భూముల వేలం వాయిదా

- 15 ఏళ్లుగా ఒకరికే ఎలా కట్టబెడతారని రైతుల ఆగ్రహం

పెద్దతిప్పసముద్రం, మే 9 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ భూములు ఏళ్ల తరబడి ఒకే వ్యక్తికి ఎలా కట్టుబెడతారంటూ.. పలువురు రైతులు శుక్రవారం మండలకేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయ భూముల కౌలు హక్కుల వేలాన్ని అడ్డుకున్నారు. మండలంలోని పోతుపేట గ్రామంలో ఈ ఆలయానికి సంబంధించిన భూములను మూడేళ్లపాటు సాగు చేసుకునే హక్కులకు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు గతంలో ఈ భూముల హక్కులను గుట్టుచప్పుడు కాకుండా ఒకే వ్యక్తి ఎలా అప్పగించారని అధికారులను నిలదీశారు. అప్పటిలాగే తమకు కూడా ఒక అవకాశం ఇవ్వాలని అధికారులను కోరారు. అయితే, వేలం నిర్వహించాల్సిందేనని మరో వర్గంవారు పట్టుబట్టారు. గతంలో హక్కులు పొందిన రైతు అధికారులతో కుమ్మక్కై తమ లీజు సమయం పూర్తయ్యేందుకు ఒక్క నెల మాత్రమే సమయం ఉన్నా పంట సాగు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో లీజు గడువు ముగిసిన తర్వాతే వేలం నిర్వహిస్తామంటూ అధికారులు వేలాన్ని వాయిదా వేశారు లీజు జూన్ 16వ తేదీతో ముగుస్తుందని, గడువు ముగియగానే తదుపరి వేలంపాట తేదీని ప్రకటిస్తామని ఆలయ అధికారులు ప్రకటించడంతో రైతులు వెనుదిరిగారు.

బైకు అదుపుతప్పి ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


రామిరెడ్డి మృతదేహం

చక్రాయపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లమడక గ్రామ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో మూలి రామిరెడ్డి (63) మృతి చెందగా.. కొండారెడ్డి అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే.... కుప్పం గ్రామం ఉప్పలవాండ్లపల్లె (బురుజుపల్లె కాలనీ) నివాసి రామిరెడ్డి, వేముల మండలం చాగలేరు గ్రామా నికి చెందిన కొండారెడ్డిలు బంధువులు. వారు వేంపల్లెలో పెళ్లి చూసుకొని అనంతరం చక్రాయపేటకు బైకులో వస్తుండగా మారెళ్ల మడక గ్రామ సమీపాన అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొన్నా రు. దీంతో వాహనం నడుపుతున్న కొండారెడ్డికి తీవ్ర గాయాలు కాగా, వెనుక కూర్చున్న రామిరెడ్డి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాయలకుంట్ల గ్రామంలో చోరీ

- రూ.60 వేలు నగదు అపహరణ



బీరువాలోని వస్తువులను చెల్లాచెదరుగా పడేసిన దృశ్యం

బి.కోడూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాయలకుంట్ల గ్రామంలో గురువారం రాత్రి తాతిబోయిన ఓబులేసు ఇంటిలో చోరీ జరిగింది. ఓబులేసు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రాత్రి బద్వేలుకు పెళ్లికి వెళ్లారు. గమనించిన దొంగలు రాత్రికి ఆ ఇంటిలో చొరబడి బీరువాను పగలగొట్టి రూ.60వేలు చోరీకి పాల్పడ్డారు. తమ కుమారుడు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుండగా.. ఫీజు కట్టేందుకు పత్తి డబ్బులు రూ.60వేలు తీసుకువచ్చి ఇంటిలో పెట్టుకున్నామని.. ఆ డబ్బులు చోరీ చేశారని బాధితుడు వాపోయారు. ఈమేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసురేశ్ తెలిపారు.

కరెంటు వైర్లు తగిలి బేల్దారి మృతి

కడప క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పులివెందుల రోడ్డులోని మెడికల్ కళాశాల వద్ద బేల్దారి పనిచేసుకుంటున్న వ్యక్తికి కరెంటు వైర్లు తగిలి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... రామరాజుపల్లెకు చెందిన నీలం ఓబులేసు (35) బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం వైద్యకళాశాల వద్ద బేల్దారి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కరంటు వైర్లు తగిలి మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి...



లింగాల, మే 9 (ఆంధ్రజ్యోతి): చేపల కోసం చెరువులోకి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. ఎస్ఐ మధుసూదన్‌రావు కథనం మేరకు.... కదిరి మండలం చెలంకూరు గ్రామానికి చెందిన యల్లనూరు హజరతయ్య అనే వ్యక్తి బేల్దారి పనికోసం లింగాల మండలంలోని కామసముద్రం గ్రామానికి వచ్చాడు. అయితే శుక్రవారం పనిలేక పోవడంతో చేపల కోసం చెరువు దగ్గరకు వెళ్లాడు. ప్రమాదవాత్తు చెరువులో పడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకొని దివ్యాంగుడి ఆత్మహత్య


సాముల ప్రతాప్ మృతదేహం

పులివెందుల, మే 9 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణానికి చెందిన సాముల ప్రతాప్ (32) అనే మూగవ్యక్తి శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు ... పట్టణంలోని పురుషోత్తంరెడ్డి కాలనీకి చెందిన సాముల ప్రతాప్ శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయం లో ఉరి వేసుకున్నాడు. అతనికి భార్య ధనలక్ష్మి(మూగవారే), నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రతాప్‌తో పాటు ఇటీవల కుమారుడికి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. దీనికితోడు అతనికి ఉన్న ఒకే ఒక్క స్నేహితుడు ఇటీవల చనిపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడప వీఅండ్‌ఎస్‌వో సస్పెన్షన్

కడప (మారుతీనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసరుగా విధులు నిర్వహిస్తున్న ముజుబర్ రెహమాన్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆ మేరకు ఆర్టీసీ రాష్ట్ర ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై గతంలో పలు అవినీతి ఆరోపణలు రావడంతో పాటు పలువురు ఉద్యోగుల వద్ద మామూళ్ల వసూళ్లు చేశారని ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పైస్థాయి అధికారులు విచారణ చేపట్టారు. అందులో నిజాలు నిగ్గు తేలడంతో రాష్ట్ర ఉన్నతాధికారులు ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. యువకుడి మృతి


మృతిచెందిన ప్రభుదాస్ (ఫైల్)

నందలూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): కడప- చెన్నై ప్రధాన రహదారి నందలూరు బాహుదానది వంతెన సమీపంలో శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు, మోపెడ్(టీవీఎస్ ఎక్స్ ఎల్) ఢీకొన్న సంఘటనలో గురునాథం ప్రభుదాస్ (22) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... రాజంపేట మండలం బోయనపల్లె ప్రాంతానికి చెందిన ప్రభుదాస్ నందలూరులోని తమ బంధువుల వద్దకు వచ్చి తిరిగి రాజంపేటకు వెళుతున్న సమయంలో తిరుపతి నుంచి కడపకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రగాయాల పాలైన అతన్ని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు నిర్ధారించారు. ప్రభుదాస్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన వెంగముని

పులివెందుల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇ.కొత్తపల్లె క్రాస్ రోడ్డు ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన పసలపాటి వెంగముని (38) అనే వ్యక్తి తన మోటార్ సైకిల్లో పులివెందుల నుంచి ఇంటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. అయితే వాహనం అదుపు తప్పి కింద పడ్డాడా లేక గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడా అనే విషయం తెలియరాలేదని పోలీసులు తెలిపారు.


రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రైల్వేస్టేషన్, బస్సుల్లో విస్తృత తనిఖీలు

ఎర్రగుంట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): కడప ఎస్పీ ఆదేశాల మేరకు ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్, ప్రైవేటు ట్రావెలింగ్ బస్సుల్లో ఎర్రగుంట్ల పోలీసులు, రైల్వే ఆర్‌పీఎఫ్, జీఆర్ పీఎఫ్ పోలీసులు గురువారం రాత్రి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో అనుమానితులు, అపరి చితులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమానితుల బ్యాగులను తనిఖీలు చేశారు. ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడళ్లలో సీఐ నరేష్ బాబు ఆధ్వర్యంలో ప్రైవేటు బస్సులలో విస్తృత తనిఖీలు చేపట్టారు. వాహనాల డిక్కీలను తెరచి బ్యాగులను పరిశీలించారు. కొందరి సెల్‌ఫోన్లను పోలీసులు తనిఖీ చేశారు.


ఆలయ ఈవోకు చెక్కును అందజేస్తున్న మండిపల్లి రాహుల్‌రెడ్డి దంపతులు

శాశ్వత అన్నదానానికి రూ.1,11,116 విరాళం

రాయచోటిటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న శాశ్వత అన్నదానానికి మండిపల్లి రాహుల్‌రెడ్డి, మైత్రేయి దంపతులు రూ.1,11,116 విరాళం అందజేశారు. వీరు తన కుమారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే మండిపల్లి నారాయణరెడ్డి మనవడు అయిన మండిపల్లి కుశాల్‌రెడ్డి పేరు మీద శుక్రవారం వీరభద్రస్వామి ఆలయ ఈవో డీవీ రమణారెడ్డికి చెక్కు రూపంలో ఈ మొత్తం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు కృష్ణయ్య, శంకరయ్య స్వాములు వారిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలికా వికాసం.. భవితకు సోపానం

- కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో, సూపర్‌వైజర్లు
- జిల్లా వ్యాప్తంగా బాలికలకు వేసవి శిక్షణ



ప్రొద్దుటూరు రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పసిప్రాయంలో లైంగిక వేధింపులు... ముక్కుపచ్చలారని చిన్నారికి మూడుముళ్లు.. ప్రేమపేరుతో వంచన.. ఏం చేయాలో తెలియక బాల్యం తల్లడిల్లుతోంది, వారిలో చైతన్యం తెచ్చే దిశగా బాలికల రక్షణ, వారి అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా కిశోర బాలిక వికాసం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ కార్యక్రమం మరుగున పడింది. కూటమి సర్కార్ దీన్ని పునఃప్రారంభించింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికా వికాసం సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది.

'పరిచయం'తో మొదలు

సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కల్పిస్తారు. ఆత్మస్థైర్యం పెంపొందించ డమే లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేస్తారు. మహిళ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జూన్ 10 వరకు నిర్వహించే కార్యక్రమాలకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. తొలి రోజు బాలికలకు పరిచయం ఏర్పాటు చేశారు. 11 నుంచి 18 ఏళ్ల వయస్సుగల కిశోర బాలికలకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహించి పలు అంశాలపైన శిక్షణ ఇస్తారు. 12 అంశాలపై కలిగించే అవగాహనలో ముందుగా దీనిపై అంగన్వాడీ, ఏఎన్ఎం, మహిళా పోలీసు, ఆశా, ఏడబ్ల్యూడబ్ల్యూ, వీపీవోలకు శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా ఆయా సచివాలయాల పరిధి, గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆర్పీలు, తదితరులను భాగస్వాములను చేశారు. వీరు ప్రభుత్వ పాఠశాలల, గ్రామీణ, జనం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తారు.

గ్రామస్థాయిలో కమిటీలు

'కిశోర వికాసం' నిర్వహణకు గ్రామ వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా 5 నుంచి 20 మంది కమిటీ సభ్యులతో గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. అంగన్ వాడీ, ఆరోగ్యకార్యకర్తలు ఇందులో ముఖ్యపాత్ర పోషిస్తారు. వసతులను దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ కేంద్రం లేదా గ్రామ, వార్డు సచివాలయాల్లో శిక్షణ తరగ తులు నిర్వహిస్తున్నారు. తమ నివాస ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నా, లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు గుర్తించిన వెంటనే గ్రూపు సభ్యులు అధికారులకు సమాచారం అందిస్తారు. వెంటనే అడ్డుకట్ట చర్యలు తీసుకుంటారు.

కార్యక్రమాల అమలు ఇలా ...

ఈనెల 6న రుతుక్రమం-శుభ్రత, లైంగిక విద్య 9న బాల్య వివాహాలు, ఆరోగ్యం-ప్రభావాలు 13న పిల్లల హక్కులు, లైంగికవేధింపుల నుంచి రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన 16న కౌమారంలో రక్తహీనత కలుగకుండా జాగ్రత్తలు 20న లింగవివక్ష, అసమానతలు, ఆడపిల్లపై వివక్ష 23న ఉన్నత విద్య, నైపుణ్యాలు, భవిష్యత్తు మార్గదర్శకం 27న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, సమస్యలు, 30న ఆర్థిక అంశాల నిర్వహణ జూన్ 3న బాలి కల నాయకత్వ లక్షణాలు, సాధికారకత 6న క్రీడలు, యోగా, వ్యాయమం 10న బాల్యవివాహాల సమస్యలు- నిర్మూలన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఆత్మస్థైర్యం నింపేలా...

కౌమార బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా.. వారిపై జరిగే అఘాయిత్యాలను ఎదుర్కొనేలా తయారు చేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుంది. బాల్య వివాహాలకు అడ్డుకట్ట, లింగ సమానత్వం పెంపొందించేందుకు దోహదపడుతుంది.

- వి.అరుణకుమారి, ఐసీడీఎస్ సీడీపీవో, ప్రొద్దుటూరు రూరల్

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

మదనపల్లె టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లె మండలం పోతబోలు హరిజనవాడ వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఎస్.గణపతి భార్య నరసమ్మను శుక్రవారం అదుపులోకి తీసుకుని 35 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భీమలింగ చెప్పారు. కురబలకోట మండలం తెట్టు గ్రామం వద్ద యు.అమరనాథ్‌ను అరెస్టు చేసి అతని నుంచి 25 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను ఇద్దరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ దాడుల్లో కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, సీఐ నాగేంద్రమ్మ, ఎస్ఐలు జబీవుల్లా, సతీష్, కానిస్టేబుళ్లు నాగరాజు, మధు, రేఖ, పృధ్వీ పాల్గొన్నారు.

కిడ్నాపైన బాలిక ఆచూకీ గుర్తింపు

- నిందితుడి అరెస్టు?

వాల్మీకిపురం, మే 9 (అంధ్రజ్యోతి): తన కూతురు కనిపించడం లేదంటూ మూడు రోజుల క్రితం ఓ మహిళ చేసిన ఫిర్యాదుపై దర్యాప్తు చేసిన పోలీసులు శుక్రవారం ఆ బాలిక ఆచూకీ గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని టీకలకోన గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న బాలిక కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె తల్లి వాల్మీకిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, కురబలకోట మండలం అంగళ్లు గ్రామం సిద్దయ్యగారికోటకు చెందిన ఓ యువకుడు అ బాలికను కిడ్నాప్ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. శుక్రవారం అతనిని అదుపులోకి తీసుకోవడంతోపాటు, బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు


అదృశ్యమైన పూర్ణ

రామసముద్రం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చొక్కాండ్లపల్లె గ్రామ పంచాయతీ పురాండ్లపల్లెకు చెందిన ఆర్.పూర్ణ(23) అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ హిమాచలపతి తెలిపారు. ఏఎస్ఐ వివరాల మేరకు.. పురాండ్లపల్లెకు చెందిన ఆర్.పూర్ణ 7వ తేదీ ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆమె భర్త శ్రీనివాసులు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు.